
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.06.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 53 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# నోటుకే సీటు



→ అవినీతిని అందలమెక్కించిన చంద్రబాబు
→ మండిపడుతున్న దేశం సీనియర్లు
→ బీజేపీకి అంటుతున్న సుజనా అవినీతి మరకలు
→ పేమెంట్ సీట్లుగా మారిన రాజ్యసభ సీట్లు

*ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల యాజమాన్యం కోటా సీట్లు, ప్రభుత్వ కోటా సీట్లు అని చూస్తుంటాం. మేనేజ్‌మెంట్ కోటాలో వుండేవి పేమెంట్ సీట్లు. వాటిని పెద్దమొత్తాలకు అమ్ముకుంటుంటారు. ఇప్పుడు రాజకీయాల లోనూ అలాంటి పేమెంట్ సీట్లుండడం ఆశ్చర్యం కలిగించే విషయమే! అన్ని పార్టీలకు కూడా ఆదాయ వనరులా మారిన ఆ పేమెంట్ సీట్ల పేరే రాజ్యసభ సీట్లు.*

రాజ్యసభ అంటే భారత రాజ్యాంగ వ్యవస్థలో పెద్దల సభ. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నిక కాబడే లోక్‌సభ సభ్యుల కంటే కూడా ఘనంగా అధికారం చెలాయించగల పార్లమెంటు సభ్యత్వ పదవి. ప్రజాక్షేత్రంలో పోటీ చేసి గెలవలేని, లేదంటే ఎన్నికలంటే ఇష్టం లేని మేధావులు, వివిధ రంగాల అనుభవజ్ఞుల కోసం భారత రాజ్యాంగం రూపొందించిన వ్యవస్థే రాజ్యసభ. ఒకప్పుడు అన్ని పార్టీల వాళ్లు కూడా మేధావులు, సీనియర్లనే రాజ్యసభకు పంపిస్తుండేవాళ్లు. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఒక్కో రాజ్యసభ సభ్యుడి విలువ వంద నుండి రెండొందల కోట్ల దాకా పలుకుతోంది. కాబట్టే ఇటీవల కాలంలో మేధావులు, రాజకీయ నిపుణులకు బదులు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలే రాజ్యసభకు ఎక్కువగా పోతున్నారు. ముఖ్యంగా గత కొన్నేళ్ళుగా తెలుగుదేశంపార్టీ (మిగతా 11వ పేజీలో)

## నెల్లూరు చూస్కో!



• నారాయణకు గ్రామీణ పంచాయితీ


అరకు పట్టకుండానే, దుక్కి దున్నకుండానే, విత్తు నాటకుండానే, నీళ్లు పెట్టకుండానే, కలుపు తీయకుండానే, ఎరువు చల్లకుండానే... పండిన పంటను హ్యాపీగా ఇంటికెత్తుకుపోయినట్లుగా... రాజకీయాలలో అసెంబ్లీకి కాదు కదా కనీసం పంచాయితీవార్డు మెంబర్‌గా కూడా పోటీ చేయని పి.నారాయణ ఏకంగా మంత్రి కావడం చూసాం. ఐదంతస్థుల మేడపైకి పోవాలంటే మెట్లు ఎక్కాలి. కాని నారాయణ మాత్రం నేరుగా ప్యారాచూట్ వేసుకుని దిగేస్తాడు. (మిగతా 11వ పేజీలో)

అలరించిన "నాటా".. ఆట - పాట - మాట...!

## అమెరికాలో ఆనంద సందడి

(వివరాలు 3వ పేజీలో)



## లెక్క తప్పలేదు!

▸ రాజ్యసభలో అడుగుపెట్టనున్న తొలి వైకాపా నేత
▸ విజయసాయిని అడ్డుకోవాలని బాబు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం

**లెక్క తప్పలేదు... అంచనా మారలేదు... అంకెల గారడీ జరగలేదు... ప్రత్యర్థుల ఎత్తులు పారలేదు. నమ్మినవాళ్లు వీడి పోలేదు. విశ్వాసమే ఆయన పాలిట విజయమైంది. నమ్మకమే ఆయనను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి తొలి రాజ్యసభ సభ్యుడిగా నిలబెట్టింది. తన పార్టీ వాయిస్‌ను పెద్దల సభలో వినిపించే అవకాశాన్నిచ్చింది.**

వేణుంబాక విజయసాయిరెడ్డి... నమ్మకానికి నిలువెత్తు చిరునామా! నెల్లూరువాసి అయిన విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి తొలి రాజ్యసభ సభ్యుడిగా రేపు పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారు. ఆయన పేరు మోసిన ఆడిటర్! వేలకోట్ల రూపాయల లెక్కల్లో నయాపైసా తేడా వచ్చినా కనిపెట్టగలడు. అలాంటి ఆడిటర్ నేటి రాజకీయ లెక్కల్లోనూ రాటుదేలిపోయాడు. కాబట్టే చంద్రబాబు ఎత్తులను సైతం చిత్తుచేసి రాజ్యసభకు పోగలుగుతున్నాడు.

గతంలో ఎన్నడూ లేనంతగా రాజ్యసభ ఎన్నికలపై రాష్ట్రంలో పెద్ద రాజకీయ డ్రామానే నడిచింది. ఏపిలో మొత్తం నాలుగు రాజ్యసభ సీట్లను భర్తీ చేయాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి తెలుగుదేశం మూడు, వైకాపాకు ఒకటి ఖాయమై పోయాయి. కొన్ని నెలల క్రితమే రాజ్యసభ ఎన్నికలను (మిగతా 11వ పేజీలో)

# వరుస బెట్టి వస్తున్నాయి...

- ఉదయగిరిని వణికిస్తున్న భూ ప్రకంపనలు
- బెంబేలెత్తుతున్న మెట్టప్రాంత ప్రజలు



ఉదయగిరి నియోజకవర్గానికి భూకంప భయం పట్టుకుంది. అప్పుడప్పుడూ స్వల్పంగా కంపిస్తున్న భూమి, ఇటీవలి కాలంలో కాస్తంత తీవ్రత చూపుతోంది. దీంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడం, కాళ్ళకింద భూమి కదలడం, పాత మిద్దెలు.. ఇళ్ళు బీటలు వారడం తరచూ జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. భూమి కంపిస్తున్నప్పుడల్లా భయంతో వణికిపోతూ ఇళ్ళ నుంచి బయటకు పరుగులు తీస్తున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయం ప్రజల్లో బాగా కనిపిస్తోంది. ఇవి స్వల్ప ప్రకంపనలే.. భయపడనక్కరలేదని అధికారులు అంటున్నా, పెద్ద ప్రకంపనలు వస్తే పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరితో పాటు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో మే 28వ తేది ఉదయం 8.45 గంటల ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏడుసార్లు భూమి కంపించినట్లు ప్రజలు చెప్తున్నారు. పెద్దశబ్ధంతో, భూమి కదలడంతో భయపడిపోయామని, ఇళ్ళ నుంచి బయటకు పరుగులు తీశామని వారు పేర్కొంటున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వున్న భూమి పొరల్లో ప్రకృతి సహజంగా సర్దుబాటు జరుగుతున్న సందర్భాల్లో ఇలాంటి ప్రకంపనలు సంభవిస్తుంటాయని, వీటి వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశోధకులు, జిల్లా అధికారులు సర్దిచెప్తున్నప్పటికీ, భూప్రకంపనల తీవ్రత నానాటికీ పెరుగుతుండడం చూసి ప్రజల్లో మునుపటికన్నా ఇటీవలి కాలంలో బాగా ఆందోళన పెరుగుతోంది. ముఖ్యంగా ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లోని దుత్తలూరు, బోడవారిపల్లి, నర్రవాడ, లక్ష్మీపురం, కమ్మవారిపాళెం, కట్టకిందపల్లి, బండకిందపల్లి, కొత్తపేట, బ్రహ్మేశ్వరం, వెంగన్నపాలెం, తిమ్మాపురం, ముత్తరాశిపల్లి, రాఘవరెడ్డిపల్లి, జడదేవి, వరికుంటపాడు, రామాపురం, దక్కనూరు, నరసింహాపురం, తూర్పు రొంపిదొడ్ల, గణేశ్వరపురం, తూర్పుచెన్నంపల్లి, టి.కొండారెడ్డిపల్లి, జి.కొండారెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి, పామూరుపల్లి, తోటల చెరువుపల్లి, మహమ్మదాపురం, టి.బోయమడుగుల, ఎర్రంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పెద్దశబ్ధంతో భూమి కంపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఇలా వరుసగా భూమి కంపిస్తుండడంతో ఆ గ్రామాల్లోని చిన్నపెద్దా, పిల్లాపాప అంతా గజగజ వణికిపోతున్నారు. ఈ నియోజకవర్గంలో సంవత్సరం రోజుల లోపే 28 సార్లు భూమి కంపించడం గమనార్హం. గత శనివారం ఒక్కరోజే వరుసగా అయిదుసార్లు భూమి కంపించి రిక్టర్ స్కేల్‌పై అది 3.4గా నమోదైందంటే దీని తీవ్రతను ఎట్టిపరిస్థితుల్లోనూ అలక్ష్యం చేయకూడదు. ఈ మెట్ట ప్రాంతాల్లో భూప్రకంపనలు క్రమేణా తగ్గకపోగా, నానాటికీ తీవ్రం కావడం పట్ల అందరూ అప్రమత్తంగా వుండడం అత్యవసరం. ఇలా భూమి కంపించనప్పుడల్లా భూకంపం వచ్చినట్లే ప్రజలు భయపడుతూ, భూకంపంతో పెద్దపెద్ద భవనాలు సైతం కుప్పకూలిపోయే దృశ్యాలు మనోనేత్రం మీద దర్శనమవుతూ మరింత భయాందోళనలకు గురవుతున్నారు. ఈ మండలాల్లోని అనేక గ్రామాల్లో వున్న గ్రామీణ ప్రాంత ప్రజలు తరచూ భూమి కంపిస్తుండడం చూసి తీవ్రంగా భయపడుతూ 'అమ్మా నేలతల్లీ! మమ్మల్ని చల్లంగా కాపాడమ్మా'.. అంటూ మనసుల్లోనే మొక్కుకుంటున్నారు. వింజమూరు చాకలికొండ కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై ఇటీవల భూప్రకంపనల తీవ్రత 3.4గా నమోదు కావడం, అయిదారు సెకన్లు దాకా భూమి అలాగే కంపిస్తుండడంతో ప్రజలు బాగా భయపడిపోయారు. ఇదేవిధంగా గత ఏడాది అక్టోబర్ 9న కూడా రాత్రి 9గంటల సమయంలో నాలుగైదుసార్లు భూమి కంపించడం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ముఖ్యంగా ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, కొండాపురం మండలాల్లో భూప్రకంపనలు వస్తున్నాయి. అక్టోబర్ 16 న కూడా పలుసార్లు భూమి కంపించింది. ఈ ఏడాది జనవరిలో అయిదుసార్లు, ఫిబ్రవరి-మార్చి నెలల్లో రెండుసార్లు భూ ప్రకంపనలు ప్రజలను వణికించాయి. అటు ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలతో పాటు, ఆత్మకూరు, సంగం, మర్రిపాడు, ఎఎస్ పేట, పొదలకూరు మండలాల్లోనూ భూమి కంపించింది. ఇలా కంపనాలు ఆగకుండా అప్పుడప్పుడూ వస్తుండడంతో ఎప్పుడు భూమి కంపిస్తుందో.. అప్పుడు పరిస్థితి ఎలా వుంటుందో తెలియక ప్రజలు హడలెత్తిపోతున్నారు. రిక్టర్ స్కేల్‌పై 5.0 లోపు వచ్చే ప్రకంపనాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెప్తున్నప్పటికీ, ఇప్పుడు 3.4 వచ్చింది కదా.. మళ్ళీ ఏదో ఒక సమయంలో ప్రకంపనలు ఇంతకన్నా తీవ్రమైతే పరిస్థితి ఏమిటని ప్రజలు భయంతో ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అటు పరిశోధకులు, ఇటు ఉన్నతస్థాయి అధికారులు ఈ విషయమై వెంటనే సమగ్రంగా చర్చించి తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## భూప్రకంపనలపై ఆందోళన వద్దు

**- జెసి ఇంతియాజ్ వెల్లడి**

ఉదయగిరి ప్రాంతంలో ఇటీవల వచ్చిన స్వల్ప భూ ప్రకంపనలకు ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏయండి ఇంతియాజ్ పేర్కొన్నారు. అదేరోజున ఆయన నెల్లూరులోని గ్రీవెన్స్ హాల్‌లో భూకంపనల విషయమై ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ భూ ప్రకంపనలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం ఎన్‌జిఆర్ఐ సంస్థ వారిచే భూకంపాల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వారితో సంప్రదించడం జరిగిందని, ఆ సంస్థకు సంబంధించి నలుగురు శాస్త్రజ్ఞుల బృందంతో వరికుంటపాడు, వింజమూరు కేంద్రాల వద్ద ఫిబ్రవరి నుంచి నిరంతర పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు.

గతంలో 1995, 1996 ప్రాంతాల్లో హైదరాబాద్ జూబ్లిహిల్స్ వద్ద ఇదేవిధంగా తరచూ భూ ప్రకంపనలు వచ్చాయని, అయితే ఆ తర్వాత ఎలాంటి భూకంప పరిస్థితులు లేకుండా నిలిచిపోయాయని పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ ప్రాంతాల్లో కూడా క్రమంగా భూకంపనలు నిలచిపోతాయని శాస్త్రజ్ఞులు తెలిపారని ఆయన వివరించారు. ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు ప్రాంతాల ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, బరువైన వస్తువులను ఎత్తయిన ప్రదేశాల్లో వుంచకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

# జొన్నవాడలో వేడుకగా బ్రహ్మోత్సవాలు

- కామాక్షితాయికి వైభవంగా రావణసేవ



కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు గత వారంరోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లిఖార్జున సమేత కామాక్షితాయి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీ స్వామిఅమ్మవారు రావణా వాహనం (రావణ సేవ)పై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలతో తయారు చేసిన రావణ వాహనంపై స్వామి అమ్మవార్లు ఊరేగారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, హోమాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ జరిగింది. రాత్రి స్వామి అమ్మవార్లను గజమాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. రావణాసురుడు శివునికి మహాభక్తుడు. శివుని దర్శనం కోసం తన ప్రేగులను వీణగా చేసుకుని వాయించిన వ్యక్తి. అంతటి భక్తుని వాహనంగా చేసుకుని గ్రామోత్సవం చేస్తే అంతా మంచి జరుగుతుందని ప్రతీతి. ఆలయ ప్రధానార్చకులు గంగాప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి అమ్మవార్లు గిన్నెభిక్ష కార్యక్రమం, రాత్రి శ్రీ స్వామి అమ్మవార్లకు వెండి నంది వాహన సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షుడు సన్నపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఆలయ ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శివకుమార్, ఉత్సవ కమిటి సభ్యులు జల్లి పెంచలయ్య, కొప్పర్తి హరినాథ్, గుబ్బా సురేష్, గాదిరాజు రఘువీరబాబు, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# వాడివేడిగా గూడూరు మున్సిపల్ సమావేశం



గూడూరు పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా సాగింది. పురపాలక సంఘంలోని సమస్యలు, ఇతర 64 అంశాలపై చర్చ జరిపారు. పురపాలక సంఘం పరిధిలో పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన భూముల్లో పురపాలక సంఘం, ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ భవన నిర్మాణాలు చేపడుతున్నారని, పురపాలక శాఖకు కోట్ల రూపాయలు నష్టం జరుగుతోందని విమర్శలు వస్తున్న నేపధ్యంలో ఆ అంశాన్ని మంగళవారం కౌన్సిల్‌లో చర్చించారు. ఈ విషయంపై 32వ వార్డు కౌన్సిలర్ నాశిన నాగులు అభ్యంతరం తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పట్టణ ప్రణాళిక అధికారిణి వివరాలు సక్రమంగా ఇవ్వలేదని ఈ అంశాన్ని ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదుపరి సమావేశాన్ని వాయిదా వేశారు. అధికారులను వివరాలు సేకరించాలని ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బాలుర, బాలికల వసతి గృహాలు మున్సిపాలిటీ అనుమతి లేకుండా అదనపు భవంతుల నిర్మాణాలు చేపట్టిన అంశంపై చర్చలు జరిపారు. నీటి సరఫరా, పైపు లీకేజీలను అరికట్టే విషయంలో అధికారులు సక్రమంగా పనులు నిర్వహించడం లేదని చర్చలు జరిగాయి.

# నేత్రదానం



నెల్లూరు స్టోన్ హౌస్‌పేట ప్రకాష్ నగర్ వాస్తవ్యులు వాయుగుండ్ల శోభన ఇటీవల పరమపదించారు. ఈమె భర్త వాయుగుండ్ల సురేంద్రకుమార్ కోరిక మేరకు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డా॥ పివిల్ రావు సారధ్యంలో ఐబ్యాంక్ టెక్నీషియన్ ఎండిబి ప్రసాద్ శోభన నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, నేత్రదాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ కార్పొరేషన్‌పై అవగాహన సదస్సు



నెల్లూరురూరల్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులోని శ్రీ సరస్వతి శివరామ సేవా మందిరంలో ఆదివారం బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందుతున్న పలు సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా సమన్వయకర్త ఉచ్చి భువనేశ్వరప్రసాద్ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న పథకాల గురించి వివరించారు. దక్షిణ సింహపురి బ్రాహ్మణ సేవాసంఘం ప్రధానకార్యదర్శి ఆర్‌విఎస్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ ఉచితంగా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో రాళ్లపల్లి రామసుబ్బారావు, శివనారాయణ, సుబ్రహ్మణ్యం, రాఘవేంద్రరావు, కేసరి శ్రీనివాసులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## అలరించిన "నాటా"... ఆట - పాట - మాట..!

# అమెరికాలో ఆనంద సందడి

"నాట"(నార్త్ అమెరికా తెలుగు సమితి) 3వ ద్వైవార్షిక సమావేశాలు మే 27, 28, 29వ తేదీలలో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో డల్లాస్ నగరంలో ఘనంగా జరిగాయి. 27వ తేదీ సాయంత్రం 6గంటలకు బాంక్వెట్‌తో ప్రారంభమైన వేడుక 29వ తేదీ అర్ధరాత్రి కోటి పాటల సందడితో ముగిసింది. 3రోజుల పాటు డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ ఆనంద వేడుకలో వేలాదిమంది తెలుగువాళ్ళు పాల్గొని మధుర జ్ఞాపకాలను మూటకట్టుకుని వెళ్ళారు.

ఈ మూడురోజుల పాటూ వ్యాపార సమావేశాలు, ఆత్మీయ సదస్సులు, సాహిత్య, సాంస్కృతిక, సంగీత వేడుకలతో పాటు యువ వేదికలు, పెళ్ళి చూపులు, రాజకీయ చర్చలూ, మీడియా మీట్‌లు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు వంటి అనేక కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. అమెరికా వై.యస్.ఆర్.గా అందరూ అపురూపంగా పిలుచుకునే మన నెల్లూరీయుడు నిడిగుంటపాళెం వాస్తవ్యుడు డా॥ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఈ సమావేశాలకి రాయల్ స్పాన్సర్‌గా వుంటూ ఈ వేడుకలకి నాయకత్వం వహించాడు. సంబరాలకు స్థానికంగా సారథ్యం వహించిన గూడూరు రమణారెడ్డి, కోర్శపాటి శ్రీధర్‌రెడ్డిలు నెల్లూరీయులే కాగా, వీరితోపాటు కృష్ణపాటి రమణ, కోటంరెడ్డి విష్ణు, మండువ సురేష్, చిల్లకూరు గోపి, గోశాల రాఘవరెడ్డి, దువ్వూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏటుకూరు రఘురామిరెడ్డి, బొమ్మళ్ళ జనార్ధన్‌రెడ్డి, సోమవరపు శ్రీనివాసులురెడ్డి, పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నూకలపాటి మధుసూదనరెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, పెన్నా మోహన్‌రెడ్డి, ప్రతీప్‌కుమార్‌రెడ్డి, మెట్టా ప్రభాకర్‌రెడ్డి, మెట్టా లచ్చారెడ్డి, బసిరెడ్డి ఉదయ్‌కిరణ్, వారణాసి ద్వారకా, చేవూరు సుజయ్‌రెడ్డి, గాలి శ్రీనివాసరెడ్డిలతో పాటు ఇంకా అనేకమంది నెల్లూరీయులు ఈ ఆనంద సందడిని విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించారు. 'నాటా' అంటే నెల్లూర్ అమెరికన్స్ తెలుగు అసోసియేషన్ అనిపించే రీతిలో ఈసారి వేడుక జరగడం విశేషం.



## నెల్లూరు ప్రగతిని ఆవిష్కరించిన

# నేను... నా నెల్లూరు



ఆదివారం రోజు జరిగిన "నేను... నా నెల్లూరు" అనే నెల్లూరీయుల ఆత్మీయ సమావేశంలో సైతం అనేకమంది నెల్లూరీయులు పాల్గొన్నారు. డా॥ ప్రేమ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి, 'లాయర్' నిర్వాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, పర్వతరెడ్డి బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రేమ్‌సాగర్‌రెడ్డి తన స్వాగతోపన్యాసంలో "ఏందబ్బయ్యా" అంటూ నెల్లూరీయులను పలకరిస్తూ తన ఊరు తన వారు అంటే తనకు ప్రాణమని, ఎప్పుడూ తన గ్రామానికి, తన వాళ్ళకీ మేలు చేయాలనే తపిస్తుంటానని అన్నారు. తమ సంస్థలో ఎక్కువ మంది నెల్లూరీయులకు అవకాశం ఇవ్వాలన్నది తన ధ్యేయమని, అర్హత కలిగినవాళ్ళు అప్లై చేస్తే తప్పక వారికి ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహిస్తానని అన్నారు.

శ్రీసిటి ఎం.డి రవి సన్నారెడ్డి తన ప్రసంగంలో ఎక్కువ శాతం నెల్లూరీయులు తమ ప్రాంత అభివృద్ధికి చేయవలసిన కృషి గురించే మాట్లాడాడు. ఎన్నో రంగాలలో నిష్ణాతులుగా వున్న నెల్లూరీయులు బయట ప్రాంతాల్లో కోట్ల రూపాయలు సంపాదించి నెల్లూరుకు సంబంధించని ప్రదేశాల్లో పరిశ్రమలను, హోటళ్ళను, ఆసుపత్రులను స్థాపిస్తున్నారని, వీలయినంత మేరకు తమ జన్మభూమికి సేవ చేసే లక్ష్యంతో నెల్లూరు పరిసర ప్రాంతాల్లో సైతం పెట్టుబడులు పెట్టి నెల్లూరుజిల్లా అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. నెల్లూరు ముఖద్వారంగా శ్రీసిటిని ఏర్పాటు చేయడం తాను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నానని, తన జన్మభూమి రుణం ఈ విధంగా తీర్చుకునే అవకాశం తనకి కలిగిందని అన్నాడు. పరిశ్రమల ద్వారా అభివృద్ధికి దోహదపడదలచిన వారికి అన్ని వేళలా శ్రీసిటీ స్వాగతం చెప్తుందని ఈ సందర్భంగా అహ్వానం పలికాడు.



'నాటి నెల్లూరు... నేటి నెల్లూరు... రేపటి నెల్లూరు' అన్న అంశంపై శివప్రభాత్‌రెడ్డి ఇచ్చిన ఉపన్యాసం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. నెల్లూరుకున్న చారిత్రాత్మక విశేషాలను వివరించడంతో పాటు ప్రస్తుతం నెల్లూరుజిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, కొత్తగా సంతరించుకుంటున్న మార్పులతో పాటు సంచలనాత్మకంగా జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి గురించి శివప్రభాత్‌రెడ్డి వివరించాడు. భవిష్యత్‌లో నెల్లూరు జిల్లాలో జరుగనున్న ప్రగతి, జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేస్తున్న కృషి తదితర అంశాలను వివరిస్తూ తమ జన్మభూమిని అభివృద్ధి చేసుకోవడానికి కేవలం పెట్టుబడులతోనే కాకుండా సేవాస్ఫూర్తితో కూడా యన్.ఆర్.ఐలు ముందుకు రావాలని, తాము పుట్టిన ఊరిలో గుడికో బడికో ఆసుపత్రికో మంచి నీటి ఎద్దడి నివారణకో లేక శ్మశాన ప్రాంగణానికో తమవంతు చేయూతనందించి పల్లెల అభివృద్ధికి దోహదపడాలని శివప్రభాత్‌రెడ్డి కోరాడు.

సేవా స్ఫూర్తితో ఇప్పటికే కోట్ల రూపాయలు దాన ధర్మాల రూపంలో అందించిన చిరస్మరణీయులైన దివంగత దానకర్ణుల స్ఫూర్తితో నేటితరంలో సేవలందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, దొడ్ల కుటుంబీకులు, అలాగే అమెరికాలో వుంటున్న ఎంతోమంది ప్రేరణతో సేవా పరిమళాలు వెదజల్లడానికి ముందుకు రావాలని శివప్రభాత్‌రెడ్డి పిలుపునిచ్చాడు.








### అలరించిన నెల్లూరు కళాకారులు

- **కరతాళధ్వనులతో మార్మోగిన ప్రధాన వేదిక**
- **సాయి హేమంత్‌కృష్ణకు ప్రశంసల వర్షం**

వేణుగానమే ప్రాణంగా..అదే లోకంగా వుంటూ, ప్రత్యేకించి నాసిక (ముక్కు)తోనే అద్భుతంగా వేణుగానం

(మిగతా 11వ పేజీలో)



### • సూపర్‌హిట్ చిత్రాల దర్శకుడు...

## ఎ.కోదండరామిరెడ్డికి 'జీవనసాఫల్య పురస్కారం'

ఎక్కడో సముద్రతీరంలోని ఓ చిన్న గ్రామంలో జన్మించిన వ్యక్తి..అనితరసాధ్యమైన కృషితో, పట్టుదలతో.. విశేష ప్రతిభా పాటవాలతో ఇంతింతై.. అంతంతై ఎదుగుతూ.. చలన చిత్ర సీమలో అద్వితీయమైన దర్శకునిగా రాణించడం ఎంతో అరుదైన గొప్ప విషయం. అంతేకాదు, తన దర్శకత్వ ప్రతిభతో ఎంతో మందిని ఉత్తమ స్థాయి నటీనటులుగా ఆయన తీర్చిదిద్దారు. ప్రేక్షకలోకంలో తనకంటూ ప్రత్యేకస్థానాన్ని సాధించుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆయన అసమాన సేవలకు గుర్తింపుకుగా ఇటీవల ఉత్తర అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన 'నాటా' వేడుకల్లో ఆయనకు ఎంతో విశిష్టమైన జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.



కోదండరామిరెడ్డిని అభినందిస్తున్న 'లాయర్' ప్రభు

(మిగతా 11వ పేజీలో)







# 'ప్రభా'తం

ప్రధాని నరేంద్రమోడీ పదవిలోకి వచ్చి మొన్న మే 26వ తేది నాటికి రెండేళ్ళు పూర్తయ్యింది. దేశ పాలనలో రెండేళ్ళ సమయం..ఎంతో కీలకమైనదే. తొలి ఏడాది కాస్తంత అటుఇటుగా వున్నా, పాలనకు అవసరమైన సత్తా చేకూర్చుకునే దశలో కొంత సమయం పట్టినా..మోడీ మాత్రం తొలి రోజునుంచే అలుపెరుగని యోధునిలా నిరంతర శ్రమతో, కృషితో దేశపాలనపై చాలా కొద్ది సమయంలోనే పట్టు సాధించారంటే అతిశయోక్తి కాదు. అప్పటిదాకా వున్న కాంగ్రెస్ ప్రభుత్వం దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తుంటే, ఆ తర్వాత వచ్చిన మోడీకి దానిని ముందుకు సాగించడం పెద్దగా కష్టం వుండేది కాదు. కానీ, కాంగ్రెస్ పాలనలో జరిగిన ప్రగతి కన్నా.. కుంభకోణాలే ఎక్కువ. అభివృద్ధి కన్నా..అవినీతే అధికం. ఎక్కడ చూసినా అంతులేని అవినీతి ఆరోపణలతో, అస్తవ్యస్తమైన విధానాలతో, అధికార దుర్వినియోగంతో..అరాచక పాలనతో విసిగి వేసారిన ప్రజలు బిజెపికి పట్టాభిషేకం చేశారు. బిజెపి రాకతో దేశానికి మంచిరోజులు తప్పకుండా వస్తాయని భావించారు. కాంగ్రెస్‌ను కూకటివేళ్ళతో సహా పెకలించి కేంద్రంలో ప్రధాని పదవిని కైవసం చేసుకున్న నరేంద్రమోడీ కూడా ప్రజల ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టే నడుచుకుంటూ, ప్రజాక్షేమమే పరమావధిగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఈ రెండేళ్ల పాలనలో తన పాలనలో ప్రభుత్వంపై ఎక్కడా అవినీతి అన్నదే లేకుండా, ఎలాంటి అరోపణలు లేకుండా పాలనను నెట్టుకురావడం ఆయన నీతి నిజాయితీకి, దీక్ష దక్షతలకు.. ప్రజాపాలనపై వున్న శ్రద్ధకు నిదర్శనం. అవే ఆయన పట్ల, బిజెపి పట్ల ప్రజల ఆదరాభిమానాలను మరింతగా పెంచుతూనే వున్నాయి. ఇంతకాలం వున్న ప్రభుత్వాలు నిత్యం అవినీతితోనే మనుగడ సాగిస్తే, బిజెపి అలాంటి బురదగుంటలో దిగకపోవడం ఆ పార్టీ విశుద్ధ పాలనకు నిదర్శనం. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశానికి ఇంత సుపరిపాలన తీసుకువచ్చిన ఘనత బిజెపిదనే చెప్పాలి. గత యుపిఏ పాలనకు, ఇప్పటి ఎన్డీఏ పాలనకు వున్న తేడా ఏమిటో ప్రజలందరికీ సుబోధకమవుతోంది. పారదర్శకమైన పాలనకు ప్రజలనుంచి ఎల్లవేళలా మద్దతు వుంటుందనే విషయం ఇప్పుడు తేటతెల్లమైంది. అంతేకాదు, ప్రధాని నరేంద్రమోడీ పాలనకు వచ్చాక కేంద్రప్రభుత్వం ఎన్నో ప్రజాప్రయోజనకరమైన పథకాలకు శ్రీకారం చుట్టింది. స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా తదితర ప్రత్యేక పథకాలతో పాటు, దేశప్రయోజనానికి ఎంతో ఉపయోగపడే కీలకరంగాలైన వ్యవసాయం, నీటి పారుదల, విద్య, వైద్యం, ఉపాధి, రైల్వే మహిళాభ్యున్నతి వంటి ఎన్నో రంగాల్లో గతంలో వున్న నిష్క్రియాపరత్వానికి తెరదించి, కుదేలై వున్న ఆయా రంగాలకు కొత్త పథకాలు, సరికొత్త పనితీరు, ప్రత్యేక పర్యవేక్షణలతో రాణింపు తెచ్చారు. ఆర్థికరంగానికి చేయూత నిస్తూ ఎన్నో వినూత్నమైన విధానాలతో అటు పారిశ్రామికవేత్తలకు, ఇటు సామాన్య ప్రజానీకానికి కూడా లాభదాయకమైన విధానాలను అనుసరిస్తూ ప్రధాని మోడీ, కేంద్రప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటున్నాయి. పవిత్రమైన గంగానది ప్రక్షాళన, హిమాలయాల్లో వున్న ప్రఖ్యాతమైన ఆలయాలను సందర్శించాలనుకునే భక్తులకు అనువైన రోడ్లు, రైలు మార్గాలు వేయడం, కాశీని అత్యద్భుతంగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో విశిష్టమైన కార్యక్రమాలు, జన్‌ధన్, జీవన్‌జ్యోతి, సబ్సిడీతో గ్యాస్‌పంపిణీ, తక్కువ ధరతో ఎల్ఇడి విద్యుత్‌లైట్ల పంపిణీ వంటి పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. అన్నిటికీ మించి ఎంతో దేశభక్తి, మాతృభక్తితో దేశప్రధాని ఎంతో విలక్షణమైన రీతిలో, ఎక్కడా అవినీతి మరక అంటక..అందరికీ ఆదర్శమైన బాటలో నడుస్తుండడం ప్రపంచాన్నే ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. అన్నిటికీ మించి మానవాళి మనుగడనే అల్లకల్లోలం చేస్తున్న ఉగ్రవాద రక్కసిని తరిమికొట్టేందుకు ప్రపంచ దేశాలన్నిటినీ సమాయత్తం చేస్తున్న మహోన్నత నేత ప్రధాని నరేంద్రమోడీ కావడం..ప్రపంచమంతా గుర్తించిన అంశం. ఆయన ఏ దేశానికి వెళ్ళినా ఆ దేశప్రజలు, నాయకులు మన ప్రధానిని చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు, ఆయన అనుసరిస్తున్న బాటన నడిచేందుకు ఉవ్విళ్ళూరుతున్నారంటే అది..ఆయన చిత్తశుద్ధికి..దేశభక్తికి నిదర్శనం. ప్రధానిగా ఏ దేశానికి వెళ్ళినా ఆ దేశంతో సత్సంబంధాలు పెంచుకుంటూ, మన దేశానికి ఎన్నో ప్రయోజనాలు కలిగించేందుకు కృషిచేస్తున్న ఏకైక నేత.. ప్రధాని మోడీ అని చెప్పకతప్పదు. అయితే, చేయాల్సింది ఇంకా మరెంతో వుంది. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని పూర్తిస్థాయిలో రాబట్టాల్సి వుంది. యువత ఉపాధికి మరిన్ని అవకాశాలను పెంపొందించాల్సివుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో మరింత ప్రగతిని సాధించాల్సి వుంది. మన రాష్ట్రానికి సంబంధించి, విభజన సమయంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సి వుంది. వేలకోట్ల లోటుబడ్జెట్‌తో అవస్తలు పడుతూ, కనీసం రాజధాని కూడా లేక, అభివృద్ధి అన్నదే కానరాక ఆంధ్రరాష్ట్రం అవస్తలు పడుతోంది. విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రం కోలుకునేందుకు ప్రధాని మోడీ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప, ఆంధ్రరాష్ట్రానికి ఇప్పుడున్న కష్టాలు తీరవు..కన్నీళ్లు ఆగవు. నిధులు లేక నీరసంతో..అభివృద్ధిలో అట్టడుగున పడిపోతున్న రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రప్రభుత్వం వెంటనే అన్నివిధాలా ఆదుకోవాల్సి వుంది. ఏదేమైనా, ప్రధాని మోడీ రెండేళ్ల పాలన ప్రజారంజకంగానే జరిగిందనే చెప్పవచ్చు. అక్కడక్కడా కొన్ని అసంతృప్తులు, ఆరోపణలు, విమర్శలు వున్నప్పటికీ, వాటిన్నిటినీ కూడా సరిదిద్దుకుంటూ, సమన్వయం చేసుకుంటూ.. ప్రధాని మోడీ దేశాభ్యున్నతికి మరింత కృషిచేయాల్సి వుంది. ఈ రెండేళ్లలోనే మంచిపాలనతో ప్రజల గుండెల్లో చెరగిపోని స్థానం సంపాదించుకున్న ప్రధాని మోడీ నేతృత్వంలో భవిష్యత్తులో దేశం సమగ్రాభివృద్ధిని సాధిస్తుందనే విశ్వాసం ప్రజలందరికీ కలుగుతోంది.

## సాధించాల్సింది ఎంతో ఉంది



ప్రధాని నరేంద్రమోడీ రెండేళ్ళ పాలన ప్రజారంజకంగా వుండి అందరి ప్రశంసలూ అందుకుంటోంది. అయితే, సాధించాల్సింది ఇంకా మరెంతోవుంది. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని పూర్తిస్థాయిలో రాబట్టాల్సివుంది. యువత ఉపాధికి అవకాశాలను బాగా పెంపొందించాల్సి వుంది. వ్యవసాయ-పారిశ్రామిక తదితర కీలకమైన అన్ని రంగాల్లో మరింత ప్రగతిని సాధించాల్సి వుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించి, విభజన సమయంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సి వుంది.

## ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఏఎండి ఇంతియాజ్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా నిర్వహిస్తున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అన్నారు. గత నెల 28వ తేదీ నెల్లూరు జేసీ ఛాంబర్‌లో జిల్లా ఉపాధి జీవనోపాధుల ఎంపిక కమిటీసభ్యులతో ఉపాధి మరియు శిక్షణ కార్యక్రమంపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన శిక్షణా సంస్థలను ఎంపిక చేసుకోవడానికి జిల్లా నుండి 31సంస్థలను ఎంపికకు ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. ఇందులో ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు వారికి ఇష్టమైన అంశంలో శిక్షణను పొంది భవిష్యత్తులో స్థిరపడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో మెప్మా ఇన్‌ఛార్జి పిడి పి.రామిరెడ్డి, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు లోకేష్ సేవాసమితి నివాళి



నారా లోకేష్ సేవాసమితి అధ్యక్షుడు పాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత నెల 28న నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో మాజీముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో టిడిపిని స్థాపించి 9నెలల్లో అధికారం చేపట్టిన మహానాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నారా లోకేష్ సేవాసమితి సభ్యులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

## గుండెపోటుతో జీవితఖైదీ మృతి

ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం అమ్మవారి పల్లికి చెందిన కె.చినవెంకటేశ్వర్లు(41) ఓ హత్య కేసులో జీవితఖైదీగా గత ఏడాది ఆగష్టు నుంచి నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఆయనకు గుండెపోటు వచ్చింది. ఇది గమనించిన జైలు వైద్యులు ఆతనికి ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై అయిదవ నగర ఎస్ఐ జగత్‌సింగ్ కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## సమన్వయంతో లక్ష్యాలను సాధిద్దాం

అభివృద్ధి సంక్షేమ రంగాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అన్నారు. ఆదివారం కలెక్టర్ బంగ్లాలో జిల్లా అధికారులతో ఆమె మాట్లాడారు. వివిధ శాఖాధికారులతో కలెక్టర్ విడి విడిగా సమావేశమై ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సమావేశ వివరాలను ఆమె అధికారులకు వివరించారు. గణాంకాలలో వెనుకబడిన శాఖలు మరింతగా కృషి చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్‌అహ్మద్, ఏజేసీ ఆర్‌వెస్ రాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి యం.సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్న చెరువులు, కుంటలు కాపాడండి




ప్రతి ఊరిలోనూ చెరువులు, నీటికుంటలు, మడుగులు ఉన్నాయి. పూర్వకాలంలోనే పెద్దలు మనుషులకు, పశువులకు నీళ్ల ఇబ్బంది ఉండకూడదని ఇవి తవ్వించారు. గతంలో ప్రతి ఇంట జలధార గుంటలుండేవి. ఇప్పుడు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. చెరువు స్థలాలనే ఇళ్ల పట్టాలుగా ఇచ్చేస్తున్నారు. ఇంకుడుగుంటల పేరుతో చంద్రబాబు పెద్ద బురిడీ కొట్టిస్తున్నారు. లక్షలాది ఇంకుడు గుంటలు తవ్వితే భూతాపం పెరుగుతుంది. నెల్లూరులో రెండు లక్షల ఇళ్లున్నాయి. ఇన్ని ఇంకుడు గుంతలు తవ్వితే ఎలుకలు, పందికొక్కులు కాపురముంటుంటాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## మహానాడు పెద్ద డబ్బా!

చంద్రబాబును, లోకేష్‌ను పొగడ్తలతో ముంచెత్తడానికే తిరుపతిలో మహానాడు నిర్వహించినట్లుగా వుంది. అలాగే జగన్‌ను విమర్శించడానికి కూడా! లోకేష్‌ను మేధావిగా, తనకంటే గొప్ప రాజకీయ పరిజ్ఞానం వున్న నాయకుడిగా చూపేందుకు చంద్రబాబు నానా తంటాలు పడ్డాడు. 1996లో ప్రధాన పదవి చేపట్టొద్దని 9వ తరగతి చదువుతున్న లోకేష్ చంద్రబాబుకు చెప్పాడట! ఆయన సలహాతోనే ఈయన కేంద్రం లోకి వెళ్లలేదట! వినేవాళ్లుంటే చంద్రబాబు చెవుల్లో ఎన్ని పూలయినా పెడుతుంటాడు.

- ఎం.నగేష్, ఆత్మకూరు.

## ఏపిలో విస్తరించాలి

భారతీయ జనతాపార్టీ అస్సాంలో అధికారంలోకి రావడం అభినందనీయం. 1983 నుండే అస్సాంలో కంటే ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీ కేడర్ బలంగా ఉండేది. కాని ఏపిలో బీజేపీ బలపడకుండా ఆ పార్టీ నాయకులే కొందరు అడ్డుకుంటున్నారు. ఇక్కడ తెలుగుదేశాన్ని కాపాడడం కోసం బీజేపీని విస్తరించ కుండా చేస్తున్నారు. ఇప్పటికైనా బీజేపీ అధిష్టానం కళ్ళు తెరవాలి. ఏపిలో బీజేపీని పటిష్టం చేసే దిశగా రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని సమూలంగా మార్చాలి.

రాంసుబ్బారెడ్డి, నాయుడుపేట.




### రాజ్యసభకు...

# నెల్లూరోళ్లు!

రాజ్యసభలో నెల్లూరుజిల్లా నుండి మరొకరికి స్థానం దక్కింది. ముత్తుకూరు మండలం తాళ్ళపూడి వాసి అయిన వేణుంబాక విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ నుండి నాలుగో అభ్యర్థిని రంగంలోకి దించకపోవడంతో విజయసాయిరెడ్డికి పోటీ తప్పిపోయి ఏకగ్రీవానికి మార్గం సుగమం అయ్యింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆయన ఎన్నిక సందిగ్ధంలో ఉండిది. తెలుగుదేశంపార్టీ నాలుగో అభ్యర్థిపై వివిధ ఊహాగానాలు వచ్చాయి. నాలుగో అభ్యర్థి నిలిచి ఉంటే ఈయన గట్టిపోటీ ఎదుర్కోవాల్సి వచ్చి వుండేది. అయితే చివరి నిముషంలో చంద్రబాబు వెనక్కు తగ్గడం విజయసాయి రెడ్డి పెద్దల సభలో అడుగుపెట్టడానికి మార్గం ఏర్పరచింది. మొదటి నుండి వై.యస్. కుటుంబానికి ఆప్తుడేకాక వారి ఆడిటర్ కూడా అయిన విజయసాయిరెడ్డి పట్ల జగన్ ఈ విధంగా కృతజ్ఞత తీర్చుకున్నాడు! ఇక గత మూడు దఫాలు కర్నాటక రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన మరో నెల్లూరీయుడు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఈసారి రాజస్థాన్ నుండి రాజ్యసభకు వెళ్ళనున్నారు.

# మనోళ్ళకు నిరాశే!




***రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో నెల్లూరు అధికారపార్టీ నేతలకు నిరాశే మిగిలింది. తెలుగు దేశంపార్టీకి దక్కే మూడు రాజ్యసభ స్థానాలలో ఒకటి రైల్వేమంత్రి సురేష్‌ప్రభుకు ఇవ్వగా, మిగిలిన రెండింటిని కేంద్రమంత్రి సుజనాచౌదరి, కర్నూలు జిల్లాకు చెందిన టి.జి.వెంకటేష్ లకు కేటాయించారు.***

రాజ్యసభ కోసం నెల్లూరుజిల్లా నుండి బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు తీవ్రంగానే ప్రయత్నించారు. అయితే ఈ విషయంలో ఆదాలకు మొదటి నుండి అవకాశాలు లేవు. కాని బీద మస్తాన్‌రావు పేరు బలంగా వినిపించింది. 1999 నుండి పార్టీని కనిపెట్టుకునే వున్న ఆయన, పార్టీ ప్రతిపక్షంలో వున్న కాలంలో సైతం అండగా నిలిచారు. ఆర్థికంగా తోడ్పాటునందించారు. 2009 ఎన్నికల్లో కావలి నుండి గెలిచిన బీద, 2014ఎన్నికల్లో ఓటమిపాలయ్యాడు. పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయన ఓడిపోవడం దురదృష్టకరమే! మొన్న ఆయన గెలిచి వుంటే మంత్రి గ్యారంటీ, డిప్యూటీ సీఎంగా కూడా అవకాశం వచ్చి వుండేది. బిఎంఆర్‌కు ప్రాధాన్యత కల్పిస్తూ చంద్రబాబు ఆయనను రాజధాని నిర్మాణ కమిటీలో సభ్యులుగా నియమించారు. అయితే బిఎంఆర్ ఆశలన్నీ రాజ్యసభ మీదే ఉండేవి. ఒక దశలో రాజ్యసభ అభ్యర్థుల విషయంలో ఆయన పేరు పరిశీలనలో వుండింది. అయితే చివరి నిముషంలో బీజేపీకి ఒక సీటు వదలాల్సి రావడం, సుజనాచౌదరిని తిరిగి కొనసాగించాలనుకోవడంతో మిగిలిన ఒక్క సీటు క్యాష్, క్యాస్ట్, డిస్ట్రిక్ట్ ఈక్వేషన్‌లో టి.జి.వెంకటేష్ పట్టుకుపోవడంతో బిఎంఆర్‌కు నిరాశ తప్పలేదు.

# పాస్‌బుక్‌కు ఇక చెక్!

- రైతులకు ఉపశమనం
- రెవెన్యూలో తగ్గనున్న అవినీతి



***పట్టాదారు పాస్‌బుక్... ఇది ఉంటేనే భూమి హక్కు ఉన్నట్లు. ఇది ఉంటేనే బ్యాంకులు లోన్లు ఇస్తాయి. ఇది చూపిస్తేనే అమ్మిన భూమిని సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్టర్ చేస్తారు. మరి ఇలాంటి పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు రైతులకు సులభంగా దొరుకుతున్నాయా? రెవెన్యూ అధికారులు నిర్ణీత గడువులోగా వారికి పాస్‌బుక్‌లు, టైటిల్‌డీడ్‌లు ఇస్తున్నారా... లేనే లేదు. రైతుల పాలిట పాస్‌బుక్‌లు పెద్ద ప్రహసనంగా మారాయి. ప్రభుత్వం రెవెన్యూ రికార్డులను పక్కాగా మెయింటేన్ చేస్తే అసలు రైతులకు ఈ పాస్‌బుక్‌లతో పనేలేదు.***

పాస్‌బుక్‌ల మూలంగానే రెవెన్యూలో అవినీతి ఎక్కువగా జరుగుతోంది. రైతులు పాస్‌పుస్తకాలకు దరఖాస్తు చేసింది మొదలు కొని వివిధ స్థాయిలలో అధికారులకు ఎకరాకు ఇంత అని లంచం ఇచ్చుకుంటూ పోవాల్సిందే! లంచం ఇచ్చినా పాస్‌బుక్‌లు, టైటిల్‌డీడ్‌లు తొందరగా వస్తాయా అంటే అదీ లేదు. నెలల కాలాల పాటూ రైతులను తిప్పించుకుంటూనే వుంటారు. ఇక విలువైన భూములకు పాస్‌బుక్‌లివ్వడానికైతే అధికారులు పెద్దమొత్తాలలోనే లంచాలు డిమాండ్ చేయడం చూస్తున్నాం. ఇటీవల నెల్లూరుజిల్లాలో పలువురు రెవెన్యూ అధికారులను ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. ఇవన్నీ కూడా పాస్‌బుక్‌లు ఇవ్వడానికి అధికమొత్తంలో లంచాలు తీసుకుంటున్న కేసులే కావడం గమనార్హం.

రెవెన్యూలో అవినీతికి ఆలవాలంగా మారిన పాస్‌బుక్‌లు, టైటిల్‌డీడ్‌ల ప్రక్రియకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమి యాజమాన్య హక్కులకు సంబంధించి ఇక 1-బి కీలకం కానుంది. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖతో రెవెన్యూ శాఖను అనుసంధానించనున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో వున్న భూమి యాజమాన్య వివరాలన్నింటిని సేకరించి వెబ్ ల్యాండ్ ద్వారా ఇక నుండి 1-బిలో మంజూరు చేయనున్నారు. దీనివల్ల ఎవరైతే భూమి కొనుగోలుదారులున్నారో వారికే 1-బిలు దక్కవచ్చు. రైతులకు లంచాల బాధ కూడా తగ్గనుంది.

# నీతి తప్పిన బాబా... నీతులు చెప్పేది!

### - వైకాపా నేతల ఎద్దేవా!

నీతి తప్పిన చంద్రబాబు నీతి, నిజాయితీ, విలువలు గురించి మాట్లాడడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించాడు. మంగళవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించాడు. ఈ ఏడాది మే నెలకి చంద్రబాబు వివిధ పద్ధతుల్లో 1,44,571కోట్లు కొల్లగొట్టారు. దీనిని ఆధారాలతో సహా బుజువు చేశాము. ఈ కొల్లగొట్టిన డబ్బుతోనే మా పార్టీ ఎమ్మెల్యేలను కొన్నారు. ఆర్థిక నేరగాడు, బ్యాంకులకు వందల కోట్లు ఎగ్గొట్టిన సుజనాచౌదరిని తిరిగి రాజ్యసభకు ఎంపిక చేయడంలోనే చంద్రబాబు ఎంత నీతిమంతుడో అర్థమవుతుంది. పాలనను పూర్తిగా గాలికొదిలేసిన చంద్రబాబు, తన పూర్తి సమయాన్ని వైకాపా ఎమ్మెల్యేల కొనుగోలుకే వెచ్చిస్తున్నాడు. రాష్ట్రం అనేక సమస్యల్లో వుంది. ప్రత్యేకహోదా లేదు, రైల్వేజోన్ ఇవ్వలేదు, రాజధానికి నిధులూ ఇవ్వడం లేదని ఓ పక్క బీజేపీపై విమర్శలు చేస్తూనే, మరోపక్క అదే పార్టీకి రాజ్యసభ సీటు ఇవ్వడం చంద్రబాబు రెండునాల్కల ధోరణికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తాడు. డబ్బుకు, ప్రలోభాలకు లొంగిపోయే చెత్త సరుకంతా వెళ్లిపోయిందని, జగన్ పట్ల విశ్వాసం వున్న వాళ్లు పార్టీలోనే ఉన్నారని, ఆయన నాయకత్వంలో తాము ముందుకు సాగుతామని వారు స్పష్టం చేశారు.



# వేసవికాలంలో చిన్నపిల్లల్లో వచ్చే సమస్యలు

Apollo SPECIALITY HOSPITALS TOUCHING LIVES

చిన్న పిల్లల్లో మరియు పురిటి పిల్లల్లో వేసవికాలంలో చాలా సమస్యలు ఎదురవుతాయి. తల్లిదండ్రులకు చాలా అనుమానాలు కూడా ఉంటాయి. ఇటువంటి సమస్యలలో ముఖ్యమైన చర్మ సంబంధిత మరియు జీర్ణకోశ సంబంధిత ఇబ్బందులు క్రింది విధంగా ఉంటాయి.

**1. చర్మ సంబంధిత సమస్యలు:**

వేసవికాలంలో ఎండ తీవ్రత వల్ల చర్మ సంబంధిత ఇబ్బందులు వస్తాయి. ఇందులో ముఖ్యమైనది పేలడం, సన్న గుల్లలు ఎర్రగా ఏర్పడి మంట, దురద ఎక్కువగా ఉంటుంది.

**నివారణ:**

ఎక్కువగా ఎండ తగలకుండా చూసుకోవడం వల్ల దీనిని నివారించవచ్చు. పురిటి పిల్లల్ని వేసవి కాలంలో ఎక్కువగా గుడ్డ చుట్టి పెట్టుకోవలసిన అవసరం లేదు. వారికి బాగా గాలి తగిలేలా ఉంచాలి.

**చికిత్స:**

చల్లటి నీళ్ళతో స్నానం చేయించడం, నీరు ఎక్కువగా త్రాగించడం, చల్లని గాలి తగిలేటట్లు చూసుకోవడం. చెమటకాయలను నివారించే పౌడర్(ప్రిక్లీహీట్ పౌడర్) వాడడం.

**2. జీర్ణకోశ సంబంధిత సమస్యలు:**

- వేసవి కాలంలో కలుషిత ఆహారం, నీరు త్రాగించడం వల్ల చిన్నపిల్లల్లో వాంతులు, విరోచనాలు ఎక్కువగా వస్తుంటాయి.
- ఇలా వాంతులు, విరోచనాల వల్ల, ఎండ వల్ల ఒంట్లో నీటి శాతం తొందరగా తగ్గిపోతుంది. దీనివల్ల చిన్న పిల్లల్లో డిహైడ్రేషన్ ఏర్పడుతుంది.
- నీటి శాతం తగ్గడం (డిహైడ్రేషన్) వల్ల ఎక్కువగా దాహం వేయడం, కళ్ళు గుంటలు పడడం, నోరు ఎండిపోయినట్లు అవడం, పాసు (మూత్రం) తక్కువగా పోవడం జరుగుతుంది. కొంతమంది పిల్లల్లో ఫిట్స్ వచ్చే ప్రమాదం, మంకుగా మారడం కూడా జరుగుతుంది.

**నివారణ మరియు చికిత్స:**

- పరిశుభ్రత పాటించడం, తాజా ఆహార పదార్థాలు ఇవ్వడం మంచిది. చిన్నపిల్లలకు ఆహారం తీసుకునే ముందు కాళ్ళు, చేతులు శుభ్రంగా కడగడం ద్వారా విరోచనాలు రాకుండా నివారించవచ్చు.
- వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్న చిన్న పిల్లలకు ఒంట్లో నీటి శాతం తగ్గకుండా ద్రవ రూప పదార్థాలు తరచూ ఇస్తూ ఉండాలి. మూత్రం తక్కువగా కాకుండా, సాఫీగా పోయేటట్లు చూసుకోవాలి.
- తల్లిపాల మీద ఉన్న పిల్లలకు తల్లిపాలు తరచూ పట్టడం ద్వారా డిహైడ్రేషన్ రాకుండా నివారించవచ్చు.
- గ్లూకోజ్ నీరు పట్టడం కన్నా ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాగించడం వల్ల ఒంట్లో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త పడవచ్చు.
- ఈ విధంగా వేసవి కాలంలో ఎండ ఎక్కువగా తగలకుండా, పరిశుభ్రమైన ఆహార అలవాట్లు పాటిస్తూ, మంచినీరు మరియు ఇతర ద్రవ పదార్థాలు స్వీకరిస్తూ వడదెబ్బ, చర్మ సంబంధిత వ్యాధులు, వాంతులు, విరోచనాల బారిన పడకుండా చిన్న పిల్లల్ని కాపాడుకోవచ్చు.



**Dr. A. Rupa**
M.B.B.S., DCH DNB (Pediatrics)
(GOLD MEDALIST)
Consultant Pediatrician
APOLLO SPECIALITY HOSPITALS
Nellore

# రోడ్ వ్యాక్యూమ్ స్వీపర్‌లు

- మేయర్ లేకుండానే ప్రారంభించిన మున్సిపల్ మంత్రి నారాయణ



మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సోమవారం నెల్లూరు, వనంతోపులోని నెల్లూరు కార్పొరేషన్ వారు ఏర్పాటు చేసిన రోడ్‌వ్యాక్యూమ్ స్వీపర్ మిషన్‌ను ప్రారంభించాడు. రాబోయే మూడేళ్లలో మరో రెండు స్వీపర్ మిషన్‌లను కొననున్నట్లు మంత్రి చెప్పాడు. ఈ మిషన్‌ల వల్ల మనుషులతో పని లేకుండా నెల్లూరురోడ్లను తొందరగా ఊడ్చేయవచ్చని మంత్రి సందేశమిచ్చాడు. ఈ చెత్తమిషన్లతో నెల్లూరు అందంగా తయారు కాబోతుందని కూడా ఆయన సెలవిచ్చాడు. మేయర్ అజీజ్ లేకుండానే మంత్రి ఈ చెత్తమిషన్‌లను ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి అనూరాధ, కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో

## కలెక్టరేట్‌లో ఇంకుడుగుంట



ఇంకుడుగుంటలో ఇసుకను పోస్తున్న జిల్లా కలెక్టర్ యం.జానకి, శరత్‌చంద్రారెడ్డి తదితరులు

నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి వారు ప్రభుత్వం పిలుపుమేరకు భూగర్భజలాల వృద్ధి కోసం ఉద్దేశించిన ఇంకుడుగుంటల తవ్వకం కార్యక్రమంలోనూ చురుకుగా పాల్గొంటున్నారు. ఈమేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ ఇంకుడుగుంటలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఈ సమితి ఏర్పాటు చేసిన ఇంకుడుగుంటను జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి ప్రారంభించారు. సామాజిక చైతన్యంలో మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి చేస్తున్న కార్యక్రమాలను ఆమె అభినందించారు.

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సంస్థను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంటల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ అడ్డదిడ్డంగా కాకుండా భవిష్యత్‌లో ఉపయోగపడేలా, శాస్త్రీయ నమూనాతో అనుభవజ్ఞుల సలహామేరకు తాము ఇంకుడుగుంటల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు.

### కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## ఎన్టీఆర్ జయంతి



కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నటరత్న పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు మే 28న జరిగాయి. ఈ కార్యక్రమానికి యనమల నాగేశ్వరయాదవ్ అధ్యక్షత వహించారు. అనంతరం కేతా లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను గడి సుబ్బరాజు(ఏఎస్ఐ), మురిగిపూడి సునీల్‌కుమార్(ఆర్ఎస్ ఫోటో వీడియో అధినేత), టంగుటూరి రామకృష్ణ (ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు)లకు అందజేశారు. బాలాజీ ఆర్కెస్ట్రా వారిచే సంగీత విభావరి జరిగింది. కోట గురుబ్రహ్మం, ఆర్వి రాఘవనాయుడు, గంగాధరరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు కేతా సుబ్బారావు, ఆర్గనైజర్ మోతె నాగార్జున పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## బ్యారేజీ పనుల్లో కదలిక

గత కొన్నేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లున్న నెల్లూరులోని పెన్నా బ్యారేజీ పనుల్లో కొంత కదలిక వచ్చింది. ఇటీవల వరకు బ్యారేజీ పిల్లర్స్ కూడా పూర్తి స్థాయిగా పూర్తి కాలేదు. కొన్నిరోజుల నుండి మాత్రం భారీ ఎత్తున మిషనరీ పెట్టి పనులు చేయిస్తున్నారు. జర్మనీకి చెందిన కాంక్రీట్ యంత్రాలతో 14శ్లాబులను పూర్తి చేశారు. మరో 7శ్లాబులను పూర్తి చేయడానికి సన్నద్ధంగా ఉన్నారు. ఇదే ఊపుతో పనులు జరిగితే త్వరలోనే పరిపూర్ణ పెన్నా బ్యారేజీని మనం చూడగలం.

## మహానాడులో మన దానకర్ణులు

తిరుపతిలో జరిగిన మహానాడు ముగింపు సభలో నెల్లూరుజిల్లా తెలుగుదేశం నేతలు పార్టీకి కోటి 69లక్షల విరాళమిచ్చి తమ చేతులకు ఎముకలు లేవని, తాము దానకర్ణ సంతతివారమని చాటుకున్నారు. మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, బీద మస్తాన్‌రావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కాంట్రాక్టర్ గంగాప్రసాద్‌లు తలో 10లక్షల రూపాయలు అందజేశారు. ఇక నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి కన్నబాబు, ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి 5లక్షల వంతున, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.అలేఖ్య, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, మాజీఎమ్మెల్యే పరసా రత్నం, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, నాయకులు ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు 2లక్షల రూపాయల వంతున ప్రకటించారు. తెలుగుదేశంపార్టీ జిల్లా అధికారప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వాసుపత్రి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, నెల్లూరు ఏఎంసి ఛైర్మెన్ బాబిరెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, తెలుగుదేశం జిల్లా మహిళా అధ్యక్షురాలు పొత్తూరి శైలజ, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, చేపూరు విజయమోహన్‌రెడ్డి, వై.వి.రామిరెడ్డి, టి.అనూరాధ, జి.నాగేశ్వరరావు, దొడ్డపనేని రాజానాయుడు, చంద్ర మధుసూదన్‌లు తలా లక్ష వంతున ప్రకటించారు.

### సంచలనం రేపిన రేప్ కేసులో

## నిందితులకు శిక్షలు!

2009 జూన్ మొదటి వారంలో నెల్లూరు నగరంలో ఓ అత్యాచారం కేసు సంచలనం సృష్టించింది. ఆ ఏడాది జూన్ 6వ తేదీన రాత్రి 11.30గంటలకు రంగనాయకులపేటకు చెందిన ఓ వివాహిత తాగుబోతు అయిన తన భర్తకు తోడుగా ఆత్మకూరు బస్టాండ్ వద్దకు వెళ్లింది. భర్త బ్రాందీషాపుకు వెళ్లి మద్యం కొంటుండగా ఈమె దగ్గరలో వున్న మసీదు వద్ద నిలబడింది. ఆ సమయంలో అక్కడున్న కొందరు తాగుబోతు కామాంధుల కళ్లు ఆమె మీద పడ్డాయి. ఆమెను తమతో పాటు రమ్మని వాళ్లు బలవంతం చేశారు. ఆమె నిరాకరించడంతో బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని చింతారెడ్డిపాలెం రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఒకరి తర్వాత ఒకరు ఆమెపై అత్యాచారం జరిపారు. ఈ దశలో నిందితుల మధ్యే గొడవలు వచ్చి, వాళ్లు తగవులాడుకుంటున్న సమయంలో బాధితురాలు తప్పించుకుని ఇంటికి చేరింది. అయితే ఆరోజు రాత్రి మహిళ కిడ్నాప్ అయ్యిందని తెలుసుకున్న పోలీసులు ఆ రాత్రంతా గాలించినా కూడా ఆమె జాడ కనిపెట్టలేకపోయారు. తెల్లారుజామున ఇంటికి చేరుకున్న బాధితురాలు తన భర్తతో కలిసి రెండో నగర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. కేసు విచారించిన రెండో నగర పోలీసులు మొత్తం 13మంది నిందితులపై కిడ్నాప్, సామూహిక అత్యాచారం కేసులు నమోదు చేశారు. నిందితులను కాపాడడానికి అప్పుడు రాజకీయ ప్రయత్నాలు జరిగాయి. అయినా పోలీసులు నిందితులపై ఛార్జిషీట్ పెట్టి, కోర్టు బోను ఎక్కించారు. ఏడేళ్లపాటు జరిగిన ఈ కేసు విచారణ మంగళవారం ముగిసింది. ఈ కేసులోని 13మంది నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.వి.సుబ్బారావు తీర్పు చెప్పారు. జరిమానా మొత్తంలో 2లక్షలు బాధితురాలికి చెల్లించాలని ఈ తీర్పులో పేర్కొన్నారు.

### క్లూస్‌టీం సిఐ

## శివారెడ్డి బదిలీ!

నెల్లూరుజిల్లాలో ఎక్కడ దొంగతనాలు, ఎక్కడ నేరాలు జరిగినా ముందుగా ప్రత్యక్షమయ్యేది క్లూస్‌టీం. అందులో శివారెడ్డి కీలకం. నేర పరిశోధనలో ఆయన సేవలు కీలకం. నెల్లూరుజిల్లాలో 17ఏళ్ల నుండి క్లూస్‌టీం ఎస్ఐగా, సిఐగా సేవలందించిన శివారెడ్డి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు క్లూస్‌టీం సిఐగా ఇంకా ఎవర్నీ నియమించలేదు. ఈ 17ఏళ్ల సర్వీసులో నెల్లూరుజిల్లాలో జరిగిన ఎన్నో పెద్దకేసులలో నిందితులను పట్టుకోవడంలో శివారెడ్డి అందించిన సహకారం మరువలేనిది.

### రెండేళ్లపాలన

## అట్టర్‌ఫ్లాప్!

చంద్రబాబు రెండేళ్ల పరిపాలన అట్టర్‌ఫ్లాప్ అని నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్‌యాదవ్ తిట్టిపెట్టాడు. సోమవారం ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశం పెట్టిన ఆయన మహానాడు వచ్చి అబద్ధాల వేదికగా మారిందన్నారు. తెలుగు ప్రజల హక్కులను తెలంగాణకు తాకట్టుపెట్టేలా మహానాడు తీర్మానాలున్నాయని ఆయన విమర్శించారు. డీసీసీ ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదా హక్కును చంద్రబాబు గాలికొదిలేసాడని, తన ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టుపెట్టాడని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పి.చెంచలబాబుయాదవ్, రఘురామ్ ముదిరాజ్, శివాచారి, అనూరాధ, శివప్రసాద్, శ్రీనివాసరావు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్లాబ్ కూలింది

నెల్లూరులో చాలా ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలో ఉండడం తెలిసిందే! సిబ్బంది పనిచేసేటప్పుడు టేబుల్ మీద ఫైళ్లను చూడడానికి ఎంత సమయం కేటాయిస్తున్నారో, ఎక్కడ పెచ్చులూడి తలలు పగులుతాయేమోనని పైన శ్లాబు వైపు కూడా అంతే సమయం చూస్తున్నారు. సోమవారం దర్గామిట్టలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో కూడా శ్లాబు పెచ్చులు కూలాయి. అయితే అవి కూలిన సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వారి తలలు సేఫ్‌గా వున్నాయి.

# రంగనాథుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం!

### - నూతన ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు

నెల్లూరు శ్రీ రంగనాథస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా ఎన్నికైన మంచికంటి సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ఆలయంలో జరిగిన నూతన ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయనను ఛైర్మెన్‌గా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని, తనకు లభించిన ఈ పదవిని శ్రీరంగనాథస్వామి సేవకు ఉపయోగిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకయ్య, ఆర్.వెంకటేశ్, జి.చంద్రశేఖర్, కాకరపర్తి జగన్మోహన్‌రావు, ఎ.హనుమంతరావు, వి.జనార్ధనరావు, సిహెచ్ మంగమ్మ, చుండూరు జగన్మోహనరావులతో పాటు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తొలుత, సుధాకర్ శ్రీరంగనాథస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలోఈ సమావేశం జరిగింది.

# మితిమీరిన 'రాజకీయ' జులుం

## వేధింపులు తట్టుకోలేక'పోతున్న' అధికారులు





**నెల్లూరు నగరపాలక సంస్థ రానురాను మరీ అధ్వాన్నంగా మారుతోంది. అవినీతికి పెద్దమ్మగా అభివృద్ధికి దద్దమ్మగా తయారైంది. నగరపాలక సంస్థ పరంగా అభివృద్ధి పనులు జరిగేది అంతంత మాత్రం. నగరం సుందర ముదనష్టంగా వుంది. ఎంత తిట్టుకున్నా ఇప్పటివాళ్ల కంటే గత పాలకులే నయమనిపిస్తున్నారు. నగరపాలకుల దెబ్బకు అధికారులు సైతం ఇక్కడ ఇమడలేకపోతున్నారు. నీతిగా, ముక్కుసూటిగా పనిచేసేవాళ్లు ఇక్కడ ఉండలేకపోతున్నారు.**

2014లో నెల్లూరు నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారి చక్రధర్‌బాబును కమిషనర్‌గా వేశారు. అతను ముక్కుసూటిగా తన పని తాను చేసుకుపోతుండేసరికి, అధికారపార్టీ నేతలకు అది రుచించక ఆయనను బదిలీ చేయించారు. ఆ తర్వాత కమిషనర్‌గా వచ్చిన పివిఎస్ఎస్ మూర్తి పరిస్థితి కూడా అంతే! ఆయనను 8 నెలలకే బదిలీ చేయించారు. తమ ఇష్ట ప్రకారం నడుచుకోవడం లేదని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావును కూడా ఇటీవల పంపించేశారు. తాజాగా ఎస్ఇ ఇమాముద్దీన్‌ను టార్గెట్ చేశారు. ఇమాముద్దీన్‌కు నెల్లూరు నగరపాలక సంస్థతో ఎంతో అనుబంధం వుంది. ప్రకాశం జిల్లా ఉలవపాడుకు చెందిన ఇమాముద్దీన్ పబ్లిక్ హెల్త్ డిఇ నుండి ఎస్ఇ వరకు 29ఏళ్ల పాటు వివిధ హోదాలలో పనిచేశారు. ఎక్కడా మచ్చలేదు. ఒత్తిళ్లకు లొంగేవాడు కాదు. ఆఖరకు గత కాంగ్రెస్ హయాంలో ఆనం వివేకా రాజ్యమేలినప్పుడు కూడా ఇమాముద్దీన్ నిజాయితీని గుర్తించి ఆయనను ఎంతగానో గౌరవించారు. ఆయన కొన్ని పనులు చేయడని తెలిసి ఆయన దాకా తీసుకుపోయే వాడు కూడా కాదు.

కాని ఇప్పుడు నగరపాలక సంస్థలో సీన్ మారింది. ఛోటామోటా కార్పొరేటర్లు కూడా ఆయనను బెదిరించసాగారు. కార్పొరేషన్‌లోని నామినేషన్ పనులు, చెత్త ట్రాక్టర్ల బిల్లులు వంటి వాటిపై ఆయన కటువుగా వ్యవహరించడంతో అధికారపార్టీ నాయకులు అతనిపై కత్తి కట్టారు. ఆయన సర్వీసును, ఆయన వ్యక్తిత్వాన్ని లెక్కపెట్టకుండా ఆయనతో వాదులాటకు దిగడం ఆయనను వేధింపులకు గురిచేయడంతో తీవ్రంగా కలత చెందిన ఆయన ఇక్కడ విధులు నిర్వహించడం ఇష్టం లేక స్వచ్ఛంధ పదవీవిరమణకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు వాలంటరీ రిటైర్‌మెంట్ ఇస్తూ ప్రభుత్వం కూడా సోమవారం జిఓ 315ను జారీ చేసింది.

మరో నాలుగేళ్లు సర్వీసు వుండగానే అవినీతి అధికార పార్టీల నాయకుల జులుం దెబ్బకు ఒక నిజాయితీ అధికారి తన ఉద్యోగాన్ని వదిలిపెట్టాల్సి వచ్చింది. అవినీతి ఇంతలా అధికారం చెలాయిస్తుంటే నీతి, నిజాయితీలు సమాధికావాల్సిందేగా!

# కార్పొరేట్ విద్యపై... పోరుబాట!

## - శ్రీకారం చుట్టిన జడ్పీ ఛైర్మెన్



జ్యోతిప్రజ్వలనతో 'సీడ్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

మన విద్యావ్యవస్థ నానాటికీ భ్రష్టు పట్టిపోతోంది. చదువుకునే బదులు చదువును కొనాల్సిన పరిస్థితులొచ్చాయి. మార్కెట్‌లో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరల కంటే ఏ ఏడాది కా ఏడాది చదువుల ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు సైతం ప్రభుత్వ విద్యను నీరు గారుస్తూ కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాస్తున్నాయి. ఇప్పుడు కనీసం పదో తరగతి వరకన్నా నూటికి 30మంది సర్కార్ బళ్లలో చదువుతున్నారు. టెన్త్ తర్వాత ఇంటర్‌లో చేరడం అయితే నూటికి 90మంది కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చేరాల్సి వస్తోంది. దీనికంతటికీ కారణం ఇంజనీరింగ్, మెడికల్ ఫోబియా! ప్రభుత్వ కాలేజీలలో చదివిస్తే తమ పిల్లలకు ర్యాంకులు రావని తల్లిదండ్రుల్లో నెలకొన్న భయం. అందుకే ఆస్తులే కాదు, మెడలో పుస్తెలు సైతం అమ్మి తమ బిడ్డలను కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేర్పిస్తున్నారు. ఈ పద్ధతి మార్చాలంటూ నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి 'సెకండరీ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ డిజైన్(సీడ్)' పేరుతో ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి 10వ తరగతి తర్వాత 11, 12తరగతులను కూడా అక్కడే నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాడు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో రెండంచల విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని, 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యగా, 6 నుండి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా మార్పు చేయాలని ఆయన సూచించారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని, మంచి మార్కులతో టెన్త్ ఉత్తీర్ణులైన ఎందరో విద్యార్థులు కాసులు లేక కార్పొరేట్ కాలేజీలకు పోలేకపోతున్నారని, అటువంటి పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్ కోసం ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరుజిల్లా నుండే ఈ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామని, ప్రజలందరూ మద్దతునివ్వాలని ఆయన కోరుతున్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపైన 'నవ్యాంధ్ర విద్యాపరిరక్షణ సమితి' ఇప్పటికే సమర శంఖం పూరించిన విషయం తెలిసిందే. ఇదే తరుణంలో రాఘవేంద్రరెడ్డి చేపట్టిన ప్రక్షాళన కార్యక్రమం శుభపరిణామం.




# సిబిఎస్ఇలో లిటిల్ ఏంజెల్స్ సత్తా




మంచి ఫలితాలు సాధించిన లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు

గూడూరు సమీపంలోని శారదా నగర్ లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 76మందికి 76మంది ఉత్తీర్ణత సాధించినట్లు, అలాగే 10 పాయింట్లకు 10పాయింట్లను హరిత్, మను, సాయి, నితీష్, సునీల్, సుశ్వంత్, వంశీకృష్ణ, అనూహ్య, నేత్ర, సాయిపుద్విత, సాయి యామిని, తనూజ 11మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారని చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం వెనుక పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఉందని అభినందించారు.

# ఆదిశంకరలో చంద్రన్న ఉద్యోగ మేళా

- 665 మంది ఎంపిక

గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన చంద్రన్న ఉద్యోగమేళాలో 665మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మెన్ వంకి పెంచలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిగిసి కంపెనీకి 34 మంది, యూరేకా ఫ్రోబ్స్ కంపెనీకి 55మంది, ఎన్ఎస్ టెక్స్‌టైల్స్ కంపెనీకి 20మంది, శుభగృహ ప్రాజెక్ట్‌కు 269మందిని, టెక్‌మహేంద్రాకి ఒకరిని, అపోలో ఫార్మసీకి 19మంది, మణప్పురం గోల్డ్‌కు 260మందిని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు.

# శభాష్ రమణయ్య



తడ – ఇచ్చాపురం జాతీయ రహదారిపై గూడూరు కూడలిలో విధులు నిర్వహిస్తూ ఆ ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా నిత్యం పహారా కాస్తున్న కానిస్టేబుల్ తుపాకుల రమణయ్య (పి.సి.128) ప్రజల అభినందనలు అందుకుంటున్నాడు. చేస్తున్న డ్యూటీలో చిత్తశుద్ధి, క్రమశిక్షణ కనపరుస్తూ అత్యంత కీలకమైన ఈ కూడలిలో ఆయన డ్యూటీ చేస్తున్నాడు. గతంలో సైదాపురం స్టేషన్‌లో ఆదర్శ ఉద్యోగిగా పనిచేస్తున్న రమణయ్య పనితీరును చూసి మెచ్చుకున్న గూడూరు డిఎస్పీ శ్రీనివాస్, రమణయ్యను తన ప్రత్యేక ఆశక్తితో చిల్లకూరు కూడలిలో నియమింపచేసుకున్నాడు. తన బాధ్యతల పట్ల రమణయ్య చూపిస్తున్న అంకితభావానికి ఆయనకి అవార్డు కూడా లభించింది. ప్రజల బాగోగుల కోసం నిరంతరం శ్రమిస్తున్న రమణయ్యకు గూడూరు ప్రాంత వాసులు అభినందనలు తెలుపుతున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# మహానాడులో చిల్లకూరు నాయకులు



చిల్లకూరు నాయకులతో ఎమ్మెల్యే పాశం

చిల్లకూరు మండల తెలుగుదేశం నాయకులు తిరుపతిలో జరిగిన తెలుగుదేశంపార్టీ మహానాడులో పాల్గొని వచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు బొల్లినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు కార్లలో మహానాడుకు వెళ్లారు. వెళ్లినవారిలో నాయకులు మధురెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణయ్యలు ఉన్నారు.

# హనుమాన్ జయంతి పూజలు



పూజలు చేస్తున్న శ్రీరామరక్ష దంపతులు

గూడూరులో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మాలవ్యా నగర్‌లో శ్రీరామ రక్షా కుటీరంలో మంగళవారం శ్రీరామరక్షా సేవా సంఘం అధ్యక్షులు శ్రీకంఠి నాగరాజారావు ఆధ్వర్యంలో స్వామి వారికి అంకురారోహణం, కలశస్థాపన, విశేష పూజలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోపూజ, శ్రీరామరక్ష దంపతుల, గురుదేవుల, మాతాపితరుల, సుమంగళుల పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## తినాలంటే 'ప్రియం'

# కొనాలంటే భయం...



- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- నియంత్రణపై శ్రద్ధలేని యంత్రాంగం

సామాన్యుడి జీవనం రానురాను మరింత దుర్భరంగా తయారవుతోంది. ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపేద, సామాన్యుల జీవనయాత్ర రోజురోజుకీ వ్యయభరితమై దయనీయంగా మారుతోంది. మార్కెట్లోకెళ్ళి ఏం కొనాలన్నా, తినాలన్నా భగ్గుమంటున్న ధరలతో ప్రజలు నిత్యం బాధపడుతున్నారు. మధ్య తరగతి ప్రజలు కూడా ఈ పెరిగిపోతున్న ధరలకు విలవిలలాడిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. చివరికి మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు కొందామనుకున్నా, జేబు నిండా డబ్బులుండాల్సిందే. ఏ కూరగాయలు కొందామన్నా ధరలు ఆకాశానికంటుతున్నాయి. నెలనెలా ఈ ధరలు మరింత పేట్రేగిపోతున్నాయి. మూడు నెలల క్రితం కిలో వంకాయలు 20రూపాయలుంటే, ఇప్పుడు ఏకంగా 35 రూపాయల దాకా వుంది. అదేవిధంగా 15రూపాయలున్న ఉల్లగడ్డలు ఇప్పుడు 45 రూపాయలు పెట్టందే రావడం లేదు. ఇక పచ్చిమిర్చి ఘాటు చెప్పనే అక్కర్లేదు. మూడునెలల క్రితం 20 రూపాయలున్న ధర ఇప్పుడు భారీగా 80కి పెరిగింది. ఇలా ఏ రకం కూరగాయలు కొనాలన్నా ఈ మూడు నెలల్లోనే రెండింతలు, మూడింతలు పెరిగిపోయాయి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు సంపాదించే నెలవారీ సంపాదన ఏమాత్రం పెరగకపోయినా, ఇలా నిత్యావసరాలు, కూరగాయలు, ఉప్పు పప్పు ధరలన్నీ పెరిగిపోతుంటే జీవితాలు ఎలా గడవాలో, కుటుంబాలనెలా పోషించుకోవాలో తెలియక ప్రజలు పడే బాధలు వర్ణనాతీతంగా వున్నాయి. ప్రజలకు నిత్యం అవసరమైన వంట సరకులు, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు వగైరాల ధరలన్నీ ఎవరి చిత్తానుసారం వారు భారీగా పెంచుకుంటూపోతున్నా అడిగే నాథులు లేరు. దూరప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలకు రవాణా ఖర్చులు వగైరాలన్నీ పోను, కిలోకి న్యాయమైనరీతిలో ఆదాయం వేసుకుని ధరలు నిర్ణయించకుండా, ఏదో ఒక సాకు చెప్పి భారీ ధరలుచెప్తూ, కొంటే కొనండి లేకపోతే మానండి అన్నట్లుండే వ్యాపారుల తీరు మరింత బాధాకరం. జిల్లా ఉన్నతాధికారులు ఒకసారి ఫలసరుకుల ధరలపై, కూరగాయల ధరలపై దృష్టి సారించి, వాటి ధరలను నియంత్రించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోతే, ఇక ఎంత గొప్పవారైనా కూరగాయలను కొనే పరిస్థితి కూడా వుండదన్నా ఆశ్చర్యం కాదు. ఏ కూరగాయలు మార్కెట్‌కు ఏ ప్రాంతం నుంచి వస్తాయి?.. వాటి అసలు ధర ఎంత?.. రవాణా ఖర్చులెంత?.. దుకాణాల నిర్వహణకు ఖర్చయ్యేదెంత?.. చివరికి ఆదాయం ఎంత?.. అనే వాటిపై కూలంకుషంగా ఆరా తీసి, న్యాయమైన ధరలు నిర్ణయించాల్సి వుంది. ధరలను నియంత్రించేందుకు గతంలో అధికారులు కాస్తంత శ్రద్ధ తీసుకున్నారు కానీ, ఇప్పుడా పరిస్థితి కనుమరుగైపోయింది. మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు చిత్తశుద్ధితో పరిశీలిస్తూ, వినియోగదారులకు న్యాయమైన ధరలతో కూరగాయలు, సరుకులు అందించాల్సిన అధికారగణం అసలు ఆ పరిస్థితులనే పట్టించుకోకపోవడం, ఒకవేళ ఎప్పుడైనా పట్టించుకున్నా కొద్దిరోజులకే మళ్ళీ పరిస్థితి యధావిధిగా మారడం మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కూరగాయలను పండించే రైతుల వద్ద వ్యాపారులు అత్యంత తక్కువ ధరకు కొనుగోలు చేసి, మార్కెట్‌కు తీసుకువచ్చి అత్యంత ఎక్కువ ధరలకు విక్రయించుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ దుస్థితి దాపురించిందంటూ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, వర్తకప్రముఖులు, సమాజసేవకులు అందరూ కలిసి ఒక బృందంగా ఏర్పడి, ఏ రోజుకారోజు ధరలను సమీక్షించి, న్యాయమైన ధరలను ప్రతిరోజూ ప్రకటించి, ఆ ధరలకే కూరగాయలు కానీ, ఇతరత్రా సరుకులు కానీ విక్రయించే ఏర్పాటు వుంటే బావుంటుందనేది పలువురి సూచన. కూరగాయల ధరలపై ఎప్పటికప్పుడు పారదర్శకంగా వుండేలా ఏరోజు ధరలను ఆరోజు మార్కెట్లలో బోర్డులు ఏర్పాటుచేసి ప్రకటించాలని కూడా ప్రజలు కోరుతున్నారు. ఇలా బోర్డుల ద్వారా, ఏరోజు ధరలు ఆ రోజు 'నెట్' ద్వారా, సెల్‌ఫోన్‌ల ద్వారా ప్రజలకు తెలియజేయడం వల్ల ఏ రకం కూరగాయల ధరలు ఎక్కువ లేదా తక్కువ వున్నాయో ప్రజలకు అర్ధమవుతుంది. తమవద్ద వున్న డబ్బును బట్టి వారు ఆ రకం కూరగాయలు కొనేందుకు సిద్ధమవుతారు కూడా. ఇలా అధికారికంగా, ఏ కూరగాయలు ఏ ధరతో వున్నాయో తెలుసుకుంటే వినియోగదారులకు ఇక బేరమాడాల్సిన అవసరం కూడా వుండదు. అంతేకాదు, అధికారుల అనుక్షణ పర్యవేక్షణ ఏర్పాటు చేసినప్పుడు ఏ కూరగాయల ధర అయినా న్యాయబద్ధంగా వుంటుంది కనుక, ధరలు భారీగా పెరగకుండా ఎప్పటికప్పుడు నియంత్రించే అవకాశం కూడా ఆ కమిటీకి వుండేలా చూడాలి. అలా కాకుండా, తింటే తింటారు లేకుంటే లేదు..అన్నట్లుగా, ఎవరూ పట్టించుకోకపోతే పేదలు, సామాన్యుల జీవన పరిస్థితి ఏం కావాలో అధికారులు ఆలోచించాల్సివుంది. ఏ సరుకైనా సరే, మార్కెట్లో ఎంత ధర చెప్తే అంత ధరకు కొనాల్సిరావడం, లేకుంటే 'భలే కొన్నార్లెండి..మాకేం తేరగా రాలేదు పోండి'..అనే ఈసడింపు మాటలను తరచూ ఎదుర్కోవడం ప్రజలకు ఎంత దుర్భరంగా వుంటోందో అధికారులు మార్కెట్లలోకి వచ్చి గమనిస్తే తెలుస్తుంది. మనిషిని బట్టి, ప్రాంతాన్ని బట్టి, ఆ రోజు పరిస్థితిని బట్టి ఏ నిమిషానికి ఆ నిమిషం ధరను భారీగా పెంచుకుంటూ పోతుండడం న్యాయమా?.. అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పండగో, పబ్బమో వస్తే పూలు, పండ్లు కొందామన్నా భయమే. వీటి ధరలను ఇక ఎవరూ పట్టలేరు. ఒక్క నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి. అన్ని ప్రాంతాల్లోనూ ధరల నియంత్రణకు కళ్ళెం వేసే నాథులే కన్పించడం లేదు. దీంతో, సామాన్యుని జీవనం రానురాను మరింత దుర్భరంగా తయారవుతోందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అట్లని అటు రైతులు కానీ, ఇటు వ్యాపారులు కానీ ఏమీ నష్టపోనక్కరలేదు. ప్రజల కోరికల్లా ఒకటే.. న్యాయమైన ధరలకు సరుకులు అందాలన్నదే. అందుకు ప్రభుత్వ అధికారులతో పాటు, న్యాయ నిపుణులు.. వర్తక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి శాశ్వత ప్రాతిపదికపై ఒక కమిటీగా ఏర్పడి, ఏరోజుకారోజు న్యాయమైన ధరలను నిర్ణయించి వినియోగదారులకి అందజేస్తే వినియోగదారులకు ఎంతో ఉపయోగంగా వుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలకు అనునిత్యం అవసరమైన కూరగాయల ధరలు, ఆకుకూరల ధరలు, నిత్యావసర సరుకుల ధరలు, పండ్లు..పూల ధరలను తక్షణం తగ్గించేందుకు అధికారులు కృషి చేయాల్సివుంది. ఒకవేళ ధరలు అప్పటికప్పుడు మారితే ఆ మార్పు కూడా అందరికీ వెంటనే తెలిసేలా సమాచారం అందుబాటులో వుంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. విశ్వవ్యాప్తంగా సమాచార వ్యవస్థ ఎంతో అధునాతన రీతిలో అందుబాటులోకి వచ్చిన నేటి ఆధునిక కాలంలో నిత్యం మార్కెట్లకు వెళ్ళి కూరగాయలు, సరుకులు కొనేందుకు వస్తున్నా...ఏ ధర ఎంత వుందో వినియోగదారులకు ముందుగానే తెలుసుకోలేని పరిస్థితి లేకపోవడం విచారకరం. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో మన వెనుకబాటుతనానికి ఇది మరో నిదర్శనం. ఇకనైనా జిల్లా అధికారయంత్రాంగం వినియోగదారులకు ప్రతిరోజూ సరుకులు, కూరగాయల ధరలు వగైరాలను అందుబాటులో వుంచేందుకు ఏ విధానం అనుసరిస్తే బావుంటుందో, బోర్డుల ద్వారా, నెట్ ద్వారా, సెల్‌ఫోన్‌ల ద్వారా ఎప్పటికప్పుడు ధరలను ప్రజలంతా తెలుసుకునేలా సరికొత్త విధానాలను అనుసరించడం ఎంతైనా అవసరమని ప్రజలు కోరుతున్నారు. ధరల నియంత్రణే వీటన్నిటి లక్ష్యంగా వుండాలని, ఆ మేరకు వినియోగదారులకు ఇక ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గల్పిక

# తెలుగుదేశం 'బ్రహ్మోత్సవం'

అది శ్రీ వేంకటేశ్వరుని పాదాల చెంత వెలసిన తిరుపతి నగరం. నెహ్రూ మున్సిపల్ పార్కు మైదానంలో తెలుగుదేశంపార్టీ మహానాడు సభా వేదిక. ఆ మైదానంలో ఒకే ఒక్కచోట చంద్రబాబునాయుడు కటౌట్... కాని మైదానం చుట్టూరా నారా లోకేష్ కటౌట్‌లే... ఒక కటౌట్ బాహుబలి గెటప్‌లో... దాని క్రింద క్యాప్షన్... 'ప్రత్యర్థులను కత్తితో కాకుండా కరెన్సీ కట్టలతో చీల్చి చెండాడిన బాహుబలి' అని వుంది. ఇంకో కటౌట్ బాలకృష్ణ 'సింహా' గెటప్... దాని క్రింద క్యాప్షన్... 'తెలుగుదేశం పాత నాయకుల పాలిట 'సింహా'వతారం' అని ఉంది. ఇంకో కటౌట్ రజనీకాంత్ 'రోబో' గెటప్‌లో... దాని క్రింద క్యాప్షన్... 'పార్టీని సాంకేతిక బాటలో నడిపిస్తున్న రోబో లీడర్...' అని ఉంది. ఇంకా అల్లూరి సీతారామరాజు, తాంద్ర పాపారాయుడు, బొబ్బిలి బ్రహ్మన్న, చండశాసనుడు, జస్టిస్ చౌదరి, కొండవీటి సింహం గెటప్‌లలో నారా లోకేష్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. మహానాడుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులందరు కూడా ఆ కటౌట్‌లను విచిత్రంగా చూడసాగారు. అంతలో చంద్రబాబు కాన్వాయ్ అక్కడకు చేరుకుంది. కారు దిగిన చంద్రబాబు మైదానం చూట్టూ వున్న తన కొడుకు లోకేష్ కటౌట్‌లను చూసాడు. పుత్రోత్సాహంతో ఆయన కళ్ళు ఆనంద భాష్పాలు కార్చాయి. ఆయన మనసులోనే 'ఎంత ఎదిగిపోయావయ్యా లోకేషయ్య' అని పాడుకుని సభాప్రాంగణం లోపలకు వెళ్లాడు.

మహానాడు వేదిక కోలాహలంగా వుంది. అక్కడ నాయకులు, కార్యకర్తలు కూర్చోవడానికి పలు బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. వైకాపా నుండి వచ్చిన ఎమ్మెల్యేలు, నాయకులకు ముందువరుసలో వివిఐపి బ్లాక్ కేటాయించారు. కాంగ్రెస్ నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు మధ్యవరుసలో విఐపి బ్లాక్ కేటాయించారు. పార్టీలోకి వస్తూపోతున్న నాయకులకు మాత్రం కొంచెం వెనుకగా ఏ-1బ్లాక్ కేటాయించారు. 1983 నుండి పార్టీలో సిన్సియర్‌గా వున్న నాయకులకు, కార్యకర్తలకు చివరి నాలుగు వరుసల కుర్చీలతో జనరల్ బ్లాక్ కేటాయించారు. దూరంగా గాలి ముద్దుకృష్ణమనాయుడు ప్రెస్ గ్యాలరీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. చంద్రబాబు నేరుగా ఆయన వద్దకెళ్లి... ఏర్పాట్లన్నీ కరెక్ట్‌గా వున్నాయా అని అడిగాడు. అందుకు గాలి.. సార్, ఏం ప్రాబ్లం లేదు, మెయిన్ గేటు వద్ద పదిమంది సెక్యూరిటీని పెట్టా, వాళ్లను దాటొచ్చారనుకో... ఈసారి ఎంట్రన్స్ గేటు వద్ద పదిహేనుమంది వుంటారు... పొరపాటున వాళ్లను కూడా దాటుకొచ్చారనుకోండి... ఇక్కడ మీడియా గ్యాలరీ గేటు వద్ద 20మందిని పెట్టా... ఖచ్చితంగా వేసేస్తారని అన్నాడు. ఆ మాటలు విన్న బొజ్జల కృష్ణారెడ్డి ఏమీ అర్థంకాక... అంత మంది ఎందుకురా గాలి... అని అన్నాడు. అందుకు గాలి.. నీకు అర్థం కాదులే, ఆ సాక్షి పేపర్, టీవీ వాళ్లు లోపలకు రాకుండా ఈ ఏర్పాట్లన్నీ అని చెప్పాడు. చంద్రబాబు సంతృప్తిగా వెళ్లిపోయాడు.

వచ్చిన కార్యకర్తలంతా "లోకేష్... లోకేష్" అని నినాదాలు చేస్తుండగా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ చిత్రపటం వద్ద దీపం వెలిగించి మహానాడును ప్రారంభించాడు. భూమా నాగిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, డేవిడ్ రాజు, పాశం సునీల్, జయరాములు, జలీల్‌ఖాన్ వంటి నాయకులు మొదట ప్రసంగించారు. తెలుగుదేశం వంటి పార్టీ ఈ ప్రపంచంలోనే లేదని, చంద్రబాబు లాంటి నాయకుడు ఈ భూమ్మీదే లేడని, తెలుగుదేశం పార్టీ మన ఇళ్లు లాంటిదని, జీవితాంతం చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేసే అవకాశం రావడం మా అదృష్టం అన్నట్లు చెప్పారు. చంద్రబాబు నాయకత్వాన్ని వీళ్లు పొగిడిన తీరు చూసి 1983బ్యాచ్ తెలుగుదేశం నాయకులు ముక్కున వేలేసుకున్నారు.

అందరూ అయ్యాక చంద్రబాబు లేచాడు. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి లోకేషే కారణం. 1996లో నాకు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా వద్దని వాదించింది లోకేషే! హైటెక్ సిటీ కట్టమన్నది, అమరావతి రాజధాని ఐడియాలన్నీ లోకేష్‌వే అని చెబుతుండగా... మధ్యలో నందమూరి హరికృష్ణ లేచి... 1995లో ఎన్టీఆర్ వెన్నుపోటు ఐడియా కూడా లోకేష్‌దేనా అని అరిచాడు. చంద్రబాబు దానిని విననట్లే నటిస్తూ... అంతెందుకు ఈరోజు ఇంతమందిని ఇలా చూస్తాననుకోలేదు. పక్కపార్టీలలో వున్న మిమ్మల్నందరినీ కలిపి ఈరోజు నాముందు నిలబెట్టింది లోకేషే! ఈ 'బ్రహ్మోత్సవం' కాన్సెప్టే లోకేష్‌దని అన్నాడు. అది విని నిమ్మకాయల చినరాజప్ప... అదేంటి సార్, అది శ్రీకాంత్ అడ్డాల కాన్సెప్ట్ కదా అని అడిగాడు. శ్రీకాంత్ అడ్డాల నిన్న సినిమా తీసాడు. కాని ఆ కాన్సెప్ట్‌ను మన లోకేష్ ముందుగానే అమలు చేసాడు. అదెలాగో చూడండి అంటూ చంద్రబాబు అప్పటికప్పుడు ఒక స్క్రీన్ ఏర్పాటు చేసి, ఒక సిడిని ప్లే చేయించాడు.

★★★★★

హైదరాబాద్‌లోని స్టార్ హయత్ హోటల్‌లో తానుంటున్న గదిలో కూర్చుని చంద్రబాబు 9+9=99 టీవీ ఛానెల్ చూస్తున్నాడు. టీవీలో ప్రత్యేకహోదాపై ఆందోళనలు చేస్తూ కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు కనిపిస్తున్నారు. వారిని చూస్తుంటే చంద్రబాబుకు దిగులేసింది. అతని ముఖంలో స్పష్టమైన బాధ కనిపించ సాగింది. అప్పుడే అక్కడకు వచ్చిన లోకేష్ అది గమనించాడు. నాన్నగారు... ఎందుకు అలా ఉన్నారని అడిగాడు. అప్పుడు చంద్రబాబు టీవీవైపు చూపిస్తూ... ఒకప్పుడు వాళ్లలో చాలామంది మన పార్టీలో ఉండేవాళ్లు. అందరూ ఒకచోట ఉంటే ఆ సందడే వేరు.. ఆ ఉత్సాహమే ఒక బ్రహ్మోత్సవంలా ఉంటుంది... అంటూ చంద్రబాబు తన డైరీలో అదే పాయింట్ రాసుకున్నాడు. అప్పుడు లోకేష్.. నాన్నగారు, మీ కోరిక నేను తీరుస్తాను, మీ కొడుకుగా ఆ బాధ్యత నాది. ఎంత ఖర్చయినా గాని, ఎంత దూరమైనాపోనీ... మీ కలను నేను సాకారం చేస్తానంటూ రంగంలోకి దిగాడు. తండ్రి కళ్లల్లో ఆనందం చూడడం కోసం వైకాపా, కాంగ్రెస్‌లలో వున్న పాత తెలుగుదేశం నాయకులు, ఎమ్మెల్యేలతో పాటు, తెలుగుదేశంతో సంబంధం లేని నాయకులను కూడా పార్టీలోకి తీసుకొచ్చాడు. వారందరినీ చూసి చంద్రబాబు మురిసిపోతూ... లోకేష్ భుజం మీద చెయ్యేసి నిజమైన కొడుకువంటే నువ్వే... నిఖార్సయిన బ్రహ్మోత్సవం అంటే ఇదే... అని చెప్పాడు. ఇక్కడితో స్క్రీన్ మీద సీన్‌లు అయిపోయాయి. అది చూసి కార్యకర్తలు... లోకేష్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయసాగారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులకు ఆటంకాలు వచ్చినా పట్టుదలతో సాధిస్తారు. వ్యవహారాలను సామరస్యంగా నడపండి. ఒక్కొక్కసారి ఇతరులను బాధపెట్టే పరిస్థితి మీకుంటుంది. వృత్తి వ్యాపారాలలో సామాన్య వృద్ధి, సామాన్య ఆదాయం ఉంటుంది. అష్టమ శని కారణంగా ఖర్చులు, మనస్పర్థలు ఎక్కువగా ఉంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత తక్కువ.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మీ పరిధి సభ్యులతో తగాదాలు పెట్టడానికి, సమస్యలు కలిగించడానికి ప్రయత్నాలుంటాయి. వృత్తి ఉపాధి పథకాలవారికి సామాన్య ఆదాయం. వ్యాపార వర్గాలకు పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. ఆర్థికంగా బాగానే ఉంటుంది. ఉద్యోగార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులను సమర్థతతో నిర్వహిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. వాణిజ్య వృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబంతో, బంధువులతో విభేదాలు రాకుండా జాగ్రత్తపడాలి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. అనుకున్న పనులు సరిగా జరగవు. మానసిక ప్రశాంతత అలవాటు చేసికొనండి. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధియుండి, ఆదాయం పెరుగుతుంది. మీ పనులకు ప్రోత్సాహం బాగుంటుంది. నిర్మాణాలు రిపేర్లు నిదానంగా సాగుతాయి. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు మంజూరు కాగలవు. సన్మానాలు, గౌరవాదరణలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి ఉపాధి పథకాలలో రాణిస్తారు. వ్యాపారాలు సంతృప్తికరంగా ఉంటాయి. కొత్త పరిచయాలుంటాయి. చేపట్టిన పనులందు టెన్షన్ ఉండినా సవ్యంగానే సాగుతాయి. అనుకోని అదనపు ఆదాయం, నూతన వస్తువులు సమకూరడం ఉంటుంది. మిమ్మల్ని వ్యతిరేకించేవారు కూడా రాజీకి వస్తారు. కొత్త పెట్టుబడులకు, పరిశ్రమలు, వ్యాపార ప్రారంభాలకు అవకాశముంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు సరిగా జరగవు. విచ్చలవిడిగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన స్థితి ఉండదు. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బాల్య స్నేహితులను కలుసుకొంటారు. బంధువులతో సరైన అవగాహన ఉండక తగాదాలు వస్తాయి. అవసరాలకు ఋణాలు చేస్తారు. సమస్యలలోనికి లాగడానికి ఇతరుల కవ్వింపులుంటాయి. కుటుంబసౌఖ్యం కలదు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 3.6.2016 నుండి
తేది. 9.6.2016 వరకు

ఈ వారం మేషంలో బుధుడు, 8తేది నుండి వృషభంలో బుధుడు, మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, వృషభంలో రవిశుక్రులు, సింహంలో గురు రాహువులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

నిశ్చితార్థాలు, ముహూర్తాలు పెట్టుకొనకూడదు.

**వైశాఖ మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | శుక్ర | త్రయోదశి | ప॥ గం.1.31వ॥ |
| తేది. 4 | శని | చతుర్దశి | ప॥ గం.11.08వ॥ |
| తేది. 5 | ఆది | అమావాస్య | ఉ॥ గం.8.54వ॥ |

**జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | సోమ | పాడ్యమి | ఉ॥ గం.6.54వ॥ |
| | పిదప | విదియ | రా॥ గం.5.10వ॥ |
| తేది. 7 | మంగళ | తదియ | రా॥ గం.3.44వ॥ |
| తేది. 8 | బుధ | చతుర్థి | రా॥ గం.2.52వ॥ |
| తేది. 9 | గురు | పంచమి | రా॥ గం.2.25వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా ఇబ్బందులుండగలవు. వృత్తి వ్యాపారాలలో సంపాదన సరిగా ఉండదు. తొందరపాటు చర్యలు, మాటలు పలకకుండా జాగ్రత్త పడండి. వస్తు వాహన రిపేర్లు, గృహ రిపేర్లుంటాయి. ఇంట్లో వ్యక్తులతో అనుకూలత తక్కువ. కుటుంబ ఖర్చులు బాగా పెరుగుతాయి. ఉద్యోగులు తమ పై అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా ఉండండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సమయోచిత నిర్ణయాలవల్ల ప్రయోజనం పొందుతారు. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు, ఆదాయము పెరుగుదల ఉంటుంది. పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు పొందడం, చెల్లింపులు సకాలంలో జరపడం ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో రాణించగలరు. కొత్త విద్యాకోర్సులు లభిస్తాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనవసరమైన ఖర్చులు, అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. చేపట్టిన పనులకు ఆటంకాలుండినా సానుకూలం కాగలవు. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అసంతృప్తినే కలిగిస్తాయి. ఆస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులు వాయిదా వేసికొనడం మంచిది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్త అవసరం.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్టాకిస్టులకు, హోల్‌సేల్ వ్యాపారులకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాల వృద్ధి, ఆదాయం సంతృప్తికరం. బంధువర్గంతో వ్యవహారాలు, మనస్పర్థలు లేకుండా చూచుకొనండి. బిడ్డల విద్యా, వివాహ విషయాలలో శ్రద్ధ చూపెడతారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొందరు మీపై పరోక్ష విమర్శనలు చేస్తారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చిన్న వ్యాపారులు, వృత్తి పని వారికి ఆదాయం, ఆర్థిక స్థితి బాగుంటుంది. ఆటంకాల వల్ల టెన్షన్ ఉండినా చేయదలచిన పనులు పూర్తి చేస్తారు. కొత్త పరిచయాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బంది పడరు. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారులకు స్థాన మార్పులుండగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పెండింగ్‌లో పడియున్న పనులు మరల కొనసాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు, ఇంటర్వ్యూలు అందుతాయి. ఆర్థిక నిర్ణయాలందుగాని వ్యవహారాలందుగాని ఇతరుల సలహాలు పొందడం మంచిది. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడవచ్చును. కొత్త విషయాలను కుటుంబంలో చర్చించవచ్చును. గృహోపకరణాలు సమకూర్చుకొంటారు.



### డాక్టర్ గురురాజ్ దేశ్‌పాండేకు

# నాయుడమ్మ అవార్డు

**- డాక్టర్ ఎ.జగదీష్ వెల్లడి**

నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతిఏటా అందజేసే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డుకు ఈ ఏడాది అమెరికాలోని గొప్ప పారిశ్రామికవేత్త, పలు ప్రతిష్ఠాత్మక సంస్థలను నెలకొల్పిన డాక్టర్ గురురాజ్ దేశ్‌పాండేను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ తెలియజేశారు. డాక్టర్ దేశ్‌పాండే కర్నాటకలోని హుబ్లీలో జన్మించారని, మద్రాస్ ఐఐటిలో గ్రాడ్యుయేషన్, ఆ తర్వాత కెనడాలోని క్వీన్స్ యూనివర్శిటీలో డేటా కమ్యూనికేషన్స్‌లో పిహెచ్‌డి చేశారని ఆయన పేర్కొన్నారు. స్పార్టాగ్రూప్ ఛైర్మన్‌గా, కాస్కేడ్ కమ్యూనికేషన్స్ కార్పొరేషన్, ఎంఐటి కార్పొరేషన్‌లలో మెంబర్‌గా వున్నారని, 2002లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎంఐటిలో దేశ్‌పాండే సెంటర్ ఫర్ టెక్నొలాజికల్ ఇన్నొవేషన్స్‌ను స్థాపించి పరిశోధనలకై పెద్ద నిధిని కూడా ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. వీరు స్థాపించిన స్కై మోర్ నెట్‌వర్క్స్ ఈ విభాగంలో అతిపెద్ద పరిశ్రమ అని, మనదేశంలో పలు సంస్థలకు దేశ్‌పాండే ఉదారంగా విరాళాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. జులైలో నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో దేశ్‌పాండే 22వ నాయుడమ్మ స్మారకోపన్యాసం చేసి, ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నాయుడమ్మ అవార్డు-2016ను అందుకుంటారని ఆయన వివరించారు.

# క్రీడాకారుల పౌష్టికాహార ముగింపు సభ



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే నెల 1 నుండి 31వ తేదీ వరకు క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. 31వ తేదీన క్రీడాకారులకు కేక్స్, పఫ్స్, శీతల పానీయాలు, కోల్గేట్ పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా ఎస్.రాఘవేంద్రశెట్టి, వీరిశెట్టి హజరత్‌బాబు, డా॥ అట్ల సునీల్‌కుమార్, పి.శ్రీనివాసులు రెడ్డిలు వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వేలూరి రంగారావు మాట్లాడుతూ మే నెల 1 నుంచి 31వరకు దాతల సహకారంతో దాదాపు 3లక్షల రూపాయలకు పైగా వ్యయం చేసి క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ప్రతి నెల 1వ తేదీన ఉచితంగా బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రతి నెల 2వ ఆదివారం ప్రముఖ డాక్టర్లతో వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, మూడు నెలలకోసారి తక్కువ రుసుముతో కార్పొరేట్ హాస్పిటల్ వారి సౌజన్యంతో 8రకాల రక్తపరీక్షలు వాకర్స్‌కు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ రవీంద్రబాబు, క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్, అసోసియేషన్ కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఉపాధ్యక్షులు బాసం శేషగిరిరావు, నలుబోలు బలరామయ్యనాయుడు, డా॥ అంకిరెడ్డి, డా॥ శ్రీనివాసకుమార్, హరిప్రసాద్, ఎం.ఎస్.రెడ్డి, కె.తిరుపతినాయుడు, జి.వి.రత్నం, బాబురావు, రమేష్, గఫార్ తదితర వాకర్స్ ప్రముఖులు పాల్గొన్నారు.

# మాగుంట లే అవుట్‌లో గాయత్రి కాలేజీ



ఈ నెల 1వ తేదీన నెల్లూరు మాగుంట లే అవుట్‌లో శ్రీ గాయత్రి విద్యాసంస్థల నూతన భవనం(డే క్యాంపస్)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, కళాశాల జోనల్ డైరెక్టర్ నరసయ్య, గిరిధర్‌లు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్స్ తమ అకడమిక్ ప్రోగ్రామ్‌ను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

# పెరుగుకు ప్రతిష్ఠాత్మక అవార్డు




నెల్లూరుకు చెందిన రచయిత, సహాయవాణిజ్య పన్నులశాఖాధికారి పెరుగు రామకృష్ణకు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. ఇటీవల చెన్నైలోని సవేరా హోటల్ సమావేశ మందిరంలో యునైటెడ్ రైటర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఫ్రాంక్ వెనరిస్ మెమోరియల్ ఉపన్యాస సభలో వివిధ రంగాలలో విశేష ప్రతిభా పాటవాలు చూపిస్తున్న 30మందికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి వర్గ శాస్త్రీయ సలహాదారుడు డాక్టర్ ఆర్.చిదంబరం చేతుల మీదుగా పెరుగు రామకృష్ణ "అవుట్ స్టాండింగ్ ఆథర్ ఆఫ్ డికేడ్" ఈ దశాబ్దపు ప్రతిభావంతమైన రచయిత అవార్డును అందుకున్నారు. పెరుగు రామకృష్ణ 2005 నుండి ఇప్పటివరకు చేసిన రచనల ప్రాతిపదికగా ప్యానెల్ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు యునైటెడ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ త్యాగరాజన్ తెలిపారు. ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న పెరుగు రామకృష్ణను జిల్లాకు చెందిన రచయితలు, కవులు, సహచర ఉద్యోగులు అభినందించారు.

# విశ్వోదయలో విషాదాలు

## • ఆందోళన రేకెత్తిస్తున్న మరణాలు



వెక్ ఇంజనీరింగ్ కళాశాల



కళాశాల హాస్టల్

## కావలి కబుర్లు



***నెల్లూరు జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే కావలిలోని విశ్వోదయ విద్యా సంస్థలకు ఎంతో గుర్తింపు వుంది. ఎందరో మేధావులు, విద్యావేత్తలు ఈ విద్యాసంస్థల నుండి వచ్చారు. అలాంటి విద్యాసంస్థల్లో ఇటీవల వరుసగా సంభవించిన ఇద్దరు విద్యార్థుల మరణాలు విద్యార్థులలో ఆందోళనను కలిగిస్తున్నాయి.***

ఈ కళాశాలలో మొత్తం దాదాపు 1560 మంది విద్యార్థులు ఉండగా వారిలో 860 మంది అమ్మాయిలు, 700 మంది అబ్బాయిలు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థుల ఆలనా పాలనా వారి దైనందిన విషయాలను పర్యవేక్షించేందుకు వార్డన్‌లు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి 10నుండి 15మంది వార్డన్‌లు ఉండాల్సి వుండగా ఇక్కడ కేవలం 5నుండి 6మంది వార్డన్‌లతో పనులు కానిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. బాలుర హాస్టళ్ళకు ఇన్‌చార్జిగా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా యన్.శ్రీనాథ్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వాస్తవంగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి చేసిన వారు ఈ బాధ్యతలు నిర్వహించాల్సి వున్నదని శ్రీనాథ్‌రెడ్డి అనే ప్రస్తుత బాధ్యులకు ఆ అర్హతలు లేవని విద్యార్థులు చెబుతున్నారు. పిల్లల బాధలు పట్టించుకుని, వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు యాజమాన్యానికి తెలియజేయాల్సిన ఇన్‌చార్జి ఆ పని చేయడం లేదనే విమర్శలున్నాయి. విద్యార్థుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోక పోవటమే కాక అంతా బాగుందని యాజమాన్యాన్ని తప్పు తోవ పట్టిస్తూ విద్యార్థుల సమస్యలను గాలికి వదిలి వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు పలుమార్లు వెంటిలేషన్ సమస్యను సదరు ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్ళారని, అలాగే మంచి నీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించమని కోరినా ఎటువంటి స్పందన లేదంటున్నారు. విద్యార్థులు ఎటుపోతే మాకేంటి మాకు రావల్సిన జీతబత్యాలు, ఇతర ప్రయోజనాలు తమకు దక్కితే చాలని ఆ ఇన్‌చార్జి భావిస్తూ కదుపులో చల్ల కదలకుండా నెట్టుకొస్తున్నారు. యాజమాన్యానికి కూడా ఇటువంటి ఉద్యోగులే కావాలి. ఎందుకంటే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలంటే డబ్బు ఖర్చుచేయాలి. అంత వ్యయప్రయాసలు మాకెందుకనుకుంటున్నారు. విద్యార్థుల నుండి ఫీజుల రూపంలో లక్షలు వసూలు చేయడమే లక్ష్యంగా యాజమాన్యాలు భావిస్తున్నాయి.

విద్యార్థులు ఎటుపోతే మాకేమని వారి సంక్షేమాన్ని గాలిలో దీపంలా మార్చివేశాయి. యాజమాన్యానికి తప్పుడు సూచనలు, సలహాలు అందిస్తూ వారిని తప్పు త్రోవపట్టిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి, ఎట రామకృష్ణలపై విద్యార్థులు,అధ్యాపకులు, సిబ్బందిలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. అయితే గతంలో ఓ విద్యార్థిని అనుమానాస్పద మృతి, 27వ తేది తెల్లవారు జామున బిటెక్ మూడవ సంవత్సరం విద్యార్థి శివకుమార్ రెడ్డి అనుమానాస్పద మరణం విద్యార్థులు, తల్లి తండ్రులలో అభద్రతాభావం పెంచింది. కూలి నాలి చేసుకుంటూ తమ బిడ్డలకు బంగారు భవిష్యత్తు కల్పించాలని తల్లిదండ్రుల ఆశ. అయితే వారి ఆశలను అడియాసలు చేస్తూ విద్యార్థుల తల్లి తండ్రులు కట్టే ఫీజులతో బతుకుతూ ప్రాణం విలువ తెలియని అసమర్థ సిబ్బంది వల్ల విద్యాసంస్థల ప్రతిష్టే మంటగలుస్తోందని అందరూ విమర్శిస్తున్నారు.

## హాస్టల్‌లో సమస్యలేమీ లేవు

**- హాస్టల్ ఇన్‌ఛార్జి శ్రీనాథ్‌రెడ్డి వివరణ**

విట్స్, వెక్ ఇంజనీరింగ్ కళాశాలల హాస్టల్‌లో విద్యార్థులు 650మంది వరకు ఉన్నారని, హాస్టల్ నిర్మాణంలో ముందు నిర్మించిన బ్లాక్‌కు గ్రిల్స్ ఏర్పాటు చేయలేదని తరువాత నిర్మించిన బ్లాక్‌కు గ్రిల్స్ నిర్మించామని తెలియచేశారు. ప్రస్తుతం వేసవి శెలవులు కావడంతో శెలవులు పూర్తి కాగానే మొదటి బ్లాక్‌కు కూడా గ్రిల్స్ ఏర్పాటు జరుగుతుందన్నారు. హాస్టల్‌లో ఒకవైపు మాత్రమే వెంటిలేషన్ ఉందని రెండో వైపు అటాచ్డ్ బాత్‌రూమ్స్ ఉండటంతో వెంటిలేషన్ ఏర్పాటు చేయలేకపోయామన్నారు. వీరికి సంబంధించి వార్డన్లు మొదటి సంవత్సరం విద్యార్థులకు ముగ్గురు, రెండో సంవత్సరం విద్యార్థులకు ఒక్కరు, మూడో సంవత్సరం విద్యార్థులకు ఒక్కరు, నాలుగవ సంవత్సరం విద్యార్థులకు ఒక్కరు చొప్పున మొత్తం 6మంది ఉన్నారని అన్నారు. విద్యార్థులు ఎప్పుడూ వారి సమస్యలు తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. 2015 జూన్ మాసంలో నీటి సమస్య ఉన్నందున విద్యార్థుల సౌకర్యార్థం ట్యాంకులతో బయటినుండి నీటిని తీసుకు వచ్చామన్నారు. ప్రస్తుతం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని మంచినీటి సమస్య లేదని హాస్టల్ ఇన్‌ఛార్జ్, వెక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

## అప్రమత్తంగానే ఉంటాం!

**- విట్స్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు**

ఇటీవల మరణించిన ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న శివకుమార్‌రెడ్డి మంచి విద్యార్థి అని, అన్ని సబ్జెక్టులు మంచి మార్కులతో పాస్ అయినట్లు తెలిపారు. ఇవే కాకుండా ప్రత్యేక కోర్సు అయిన 'జావా' కూడా బయటకు వెళ్లి నేర్చుకుంటున్నట్లు తెలిపారు. గత కొద్దిరోజులుగా శివకుమార్‌రెడ్డి మూడవ అంతస్తులో రూము బయట నిద్రిస్తుండగా వార్డెన్ విద్యార్థిని మందలించి రూమ్‌లోకి పంపించినట్లు తెలిపారు. కళాశాల ఆవరణంలో అత్యవసర పరిస్థితుల కొరకు ఒక కారు, డ్రైవరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని సంఘటన జరిగిన 15నుండి 30నిమిషాల వ్యవధిలో ఆసుపత్రికి తరలించామన్నారు. హాస్టల్‌లో కొంతభాగానికి గ్రిల్స్‌ను ఏర్పాటు చేశామని, మిగిలిన దానికి కూడా గ్రిల్స్ ఏర్పాటు ఈ వేసవి శెలవులు ముగిసేలోపు జరుగుతుందని విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు తెలిపారు.

# హరనాథపురంలో అంగడి తెరిచారు



నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ హరనాథపురంలోని తన కార్యాలయాన్ని అవినీతి వసూళ్ల కేంద్రంగా తెరచి పెట్టాడని డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైకాపా ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్‌లు విమర్శించారు. 1వతేదీ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో వాళ్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. నెల్లూరు కార్పొరేషన్‌కు బదిలీ మీద రావాలంటేనే అధికారులు భయపడుతున్నారు. నిజాయితీగా పనిచేసిన కమిషనర్లు చక్రధర్‌బాబు, పి.వి.వి.ఎస్.మూర్తిలను బదిలీ చేయించారు. నీతి, నిజాయితీలకు ప్రతీక అయిన ఎస్ఇ ఇమాముద్దీన్ లాంటి అధికారి వీరి వేధింపులు తాళలేక స్వచ్ఛంధ పదవీ విరమణ చేయాలనుకోవడం అత్యంత దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. మేయర్ లేని సమయంలో రోడ్ వాక్యూమ్ స్వీపర్ యంత్రాన్ని మున్సిపల్ మంత్రి ప్రారంభించడం చూస్తుంటే ఇక్కడ ప్రోటోకాల్ ఎంత అధ్వాన్నంగా వుందో అర్ధమవుతోంది. కార్పొరేషన్‌కు రెవెన్యూ, హెల్త్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలు నాలుగు మూలస్థంభాలు. వాటిలో మూడు స్థంభాలు అవినీతిలో కూరుకుపోయాయి. ఇంజనీరింగ్‌లో అవినీతికి తావులేకుండా పనిచేస్తున్న ఎస్ఇ ఇమాముద్దీన్‌ను తీవ్ర ఇబ్బంది పెట్టారు. మున్సిపల్ మంత్రి పనితీరే అధ్వాన్నంగా ఉంది. చంద్రబాబు ప్రకటించిన చివరి ర్యాంకే నారాయణ పనితీరుకు అద్దం పడుతుందని వారు ఎద్దేవా చేశారు.

# రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

## ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ఉపాధ్యాయవృత్తిలో వుంటూ ఆ రంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి దాచూరి రామిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం నెల్లూరులోని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తులసీరాంబాబు అధ్యక్షతన జరిగిన దాచూరి రామిరెడ్డి సంస్మరణ సభలో ఆయన పాల్గొని రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు, పలువురు నేతలు రామిరెడ్డికి నివాళులర్పించి, ఉపాధ్యాయరంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులురెడ్డి, సిపిఎం నాయకులు జక్కా వెంకయ్య, యుటిఎఫ్ నాయకులు బాబురెడ్డి, చంద్రశేఖర్, కొండాచారి, మస్తాన్‌రావు, రాధాకృష్ణారెడ్డి, వేణుగోపాల్, రమణయ్య, నారాయణరెడ్డి, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామిరెడ్డికి 'జీవనసాఫల్య పురస్కారం'

(3వ పేజీ తరువాయి)

అంతటి ఘనకీర్తి సాధించినవారెవరో కాదు.. మన నెల్లూరీయుడు.. సినీ రంగంలో నెల్లూరుసీమ ఖ్యాతిని దశదిశలా చాటిన ప్రఖ్యాత దర్శకుడు.. మన కోదండ రామిరెడ్డి. ఏ.కోదండరామిరెడ్డి అంటే నంబర్-1 దర్శకుడనీ, సూపర్‌హిట్ చిత్రాల దర్శకుడనీ పేరు. మైపాడులో జన్మించి..నేడు అమెరికాలో ఉన్నతస్థాయి పురస్కారాన్ని అందుకున్న ఈ తరం మేటి దర్శకుడాయన. ఆయన నెల్లూరీయుడు కావడం..సింహపురి సీమకే గర్వకారణం. కేవలం ఇరవై ఏళ్ళ కాలంలోనే 75 సినిమాలకు దర్శకత్వం వహించాడాయన. ఒక్కమాటలో చెప్పాలంటే రెండు దశాబ్దాల పాటు తెలుగు సినీరంగాన్ని ఏలినవాడాయన. 1980లో 'సంధ్య' సినిమాతో చిత్రసీమలో దర్శకునిగా ప్రవేశించిన కోదండరామిరెడ్డి 2009లో పున్నమినాగు సినిమా దాకా విలక్షణమైన, వినోదభరితమైన.. సందేశాత్మకమైన, చిత్రాలెన్నిటికో దర్శకత్వం వహించారు. తీసిన ప్రతి సినిమా హిట్టే అనేవిధంగా, అనేక హిట్ సినిమాల దర్శకునిగా పేరొందారు. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి నటనా సామర్ధ్యానికి వేదికగా ఆయన చిరంజీవి హీరోగా తీసిన సినిమాలు ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించాయి. చిరంజీవి నట జీవిత ప్రస్థానానికి కోదండరామిరెడ్డి సినిమాలు స్వర్ణసోపానాలయ్యాయంటే అతిశయోక్తి కాదు. 1983లో ఆయన రూపొందించిన 'ఖైదీ' సినిమా మెగాస్టార్ చిరంజీవికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చింది. అంతేకాదు, ఆ తర్వాత అభిలాష, పసివాడి ప్రాణం, అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు, న్యాయం కావాలి, రక్షకుడు, కొండవీటి దొంగ, ముఠామేస్త్రి..వంటి చిత్రాలతో చిరంజీవి సూపర్‌స్టార్‌గా... మెగాస్టార్‌గా ఎదిగారంటే, అందుకు దర్శకునిగా కోదండ రామిరెడ్డి కృషి ఎంతగానో వుందని వేరే చెప్పనక్కర లేదు. మరో హీరో నందమూరి బాలకృష్ణతో అనసూయమ్మగారి అల్లుడు, నారీ నారీ నడుమ మురారి వంటి చిత్రాలు, అక్కినేని నాగార్జున హీరోగా తీసిన విక్కీ దాదా, ప్రెసిడెంట్‌గారి పెళ్ళాం, అల్లరి అల్లుడు వంటి చిత్రాలు, హీరో వెంకటేష్‌తో తీసిన సూర్య ఐపిఎస్, పోకిరి రాజా వంటి చిత్రాలు సూపర్‌హిట్ చిత్రాలే.

నెల్లూరు సమీపంలోని ఇందుకూరుపేట మండలంలో వున్న సముద్రతీర గ్రామమైన మైపాడు ఆయన స్వగ్రామం. 1950 జులై 1న ఆయన జన్మించారు. మంచి దర్శకునిగా రాణిస్తూ..చిత్రసీమలో వాసికెక్కిన సినిమాలెన్నో తీసి, నెల్లూరుసీమ ఖ్యాతిని దశదిశలా చాటిన కోదండరామిరెడ్డి దర్శకత్వశ్రేణిలో తొలివరుసలో నిలిచారు. కోదండరామిరెడ్డికి భార్య భారతి, కుమారులు సునీల్, వైభవ్‌రెడ్డి వున్నారు. సునీల్ వ్యాపార రంగంలో స్థిరపడితే, వైభవ్ సినీరంగంలో హీరోగా 2007లో సొంత బ్యానర్‌తో 'గొడవ' సినిమాతో ప్రసిద్ధులయ్యారు. అత్యద్భుతమైన అనేక సినిమాలకు దర్శకత్వం వహించి, ఎందరో నటీనటులను చిత్రసీమకు పరిచయం చేసి.. తెలుగు సినిమా రంగంలో అపూర్వమైన..అద్వితీయమైన దర్శకునిగా పేరొందిన ఎ. కోదండరామిరెడ్డి ఉత్తర అమెరికాలోని డల్లాస్‌లో ఇటీవల జరిగిన 'నాటా' వేడుకల్లో 'జీవన సాఫల్య పురస్కారాన్ని' అందుకోవడం...నిజంగా ఆయన జీవితానికి సాఫల్యం చేకూరినట్లే. దర్శకత్వ ప్రతిభతో.. సినీ కళారంగంలో నెల్లూరిసీమ ప్రతిభాపాటవాలను చాటుతున్న ఎ.కోదండరామిరెడ్డికి నెల్లూరీయులందరి తరపునా అభినందనలు. అమెరికాలోనూ 'నాటా' జీవనసాఫల్య పురస్కారం అందుకున్న శుభ సందర్భంగా ఆ ప్రఖ్యాత దర్శకునికి 'లాయర్'.. హృదయపూర్వక శుభాభినందనలు.

# అలరించిన నెల్లూరు కళాకారులు

(3వ పేజీ తరువాయి)

వినిపించడంలో సిద్ధహస్తుడైన సాయిహేమంత్‌కృష్ణ అమెరికాలోని 'నాటా' వేడుకల్లోనూ పాల్గొని 'నాసికా వేణుగానం'తో అందరినీ ఉర్రూతలూగించాడు. నాటా వేడుకల సందర్భంగా ఎంతో వైభవంగా, భారీఎత్తున నిర్మించిన ప్రధాన వేదికపై నెల్లూరీయుని నాసికా వేణుగానం శ్రోతలను మైమరపింపజేసింది. వేణుగానం పూర్తవగానే అక్కడివారి కరతాళధ్వనులతో వేదిక మార్మోగింది. అద్భుతం..అమోఘం..శెభాష్ సాయిహేమంత్ అంటూ అందరూ అతనిని ప్రశంసలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. తొలుత బాంక్వెట్‌లోనూ, ఆ తర్వాత మెయిన్ దయాస్‌లోనూ, అనంతరం జరిగిన ఆధ్యాత్మిక సదస్సులోనూ, చివరికి ముగింపు సభలో కూడా సాయిహేమంత్‌కృష్ణ నాసికా వేణుగానం మార్మోగిపోయింది. అంతటి మహదావకాశం నెల్లూరీయునికి రావడం, తన అత్యద్భుతమైన కళతో అందరి మన్ననలందుకోవడం ఎంతో అభినందనీయం.

## అద్భుతమనిపించిన.. నదియా నృత్యం

అదేవిధంగా నెల్లూరు నుంచి డల్లాస్‌కు వెళ్ళిన ప్రముఖ నాట్యకళాకారిణి 'నాట్యశిరోమణి' నదియా తన అద్భుతమైన నాట్యంతో అందరినీ ఆకట్టుకుంది. ఆమె నాట్యవైదుష్యానికి అందరూ పరవశించిపోయారు. విలక్షణమైన తన నాట్యంతో అమెరికాలోనూ అందరి ప్రశంసలు అందుకున్నది నదియా.

చివరిరోజు జరిగిన ముగింపు వేడుకలో ఆహుతులతో పాటూ తాను జతకలసి 'డాన్స్' చేసి తన నిరాడంబరతను, కార్యక్రమ విజయానికి అంతులేని తన ఆనందాన్ని ప్రదర్శించాడు డా॥ ప్రేమ్‌రెడ్డి. మొత్తం కార్యక్రమానికి ఈ దృశ్యం హైలైట్‌గా నిలిచింది.

# నోటుకే సీటు

(మొదటి పేజీ తరువాయి)

నుండి ఎన్నికవుతున్న రాజ్యసభ అభ్యర్థులను చూస్తుంటే పెట్టుబడిదారులకు, అవినీతి పరులకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాడో అర్ధమవుతుంది. సుజనాచౌదరి, సీఎం రమేష్, గరికపాటి రామ్మోహన్‌రావు, కంభంపాటి రామ్మోహన్... ఇటీవల కాలంలో చంద్రబాబు రాజ్యసభకు పంపిన పారిశ్రామికవేత్తలు. తాజాగా జరుగుతున్న రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి చంద్రబాబు మళ్లీ ఇదే మార్గం పట్టాడు.

9వేల కోట్ల బకాయిలున్నాడని చెప్పి మారిషస్ బ్యాంకు నుండి నోటీసులందుకున్న కేంద్రమంత్రి సుజనాచౌదరిని మళ్లీ రాజ్యసభకు నామినేట్ చేశారు. బ్యాంకుల అప్పుల విషయంలో సుజనాపై అనేక ఆరోపణలున్నాయి. ఈయన మాత్రం ఆ అప్పులతో నాకేం సంబంధం లేదంటున్నాడు. సుజనా బకాయిల వివాదం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. నిద్ర లేస్తే నీతిగా నిజాయితీగా పనిచేస్తున్నానని చెప్పుకునే చంద్రబాబు ఈసారి సుజనాను పక్కన పెడతాడని అందరూ భావించారు. కాని పార్టీకి సుజనాచౌదరి పెద్ద పెట్టుబడిదారుడు. కాబట్టి సుజనాను పక్కనపెట్టే సాహసం చేయలేక పోయాడాయన. అయితే తన కేబినెట్ నీతికి నిలువెత్తు రూపం అని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గంలో అప్పులు ఎగ్గొట్టిన ఆరోపణలున్న సుజనాచౌదరి లాంటి వారిని ఉంచుకోవడం ఎన్డీఏ ప్రభుత్వానికే మాయనిమచ్చ. 2014లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు సుజనాను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి మోడీ నిరాకరించాడు. ఆయనకు సంబంధించిన బ్యాంకు బకాయిల ఫైలును చంద్రబాబు ముందేసి, మంత్రిపదవి ఇచ్చేది లేదని తేల్చేశాడు. కొంతకాలం తర్వాత చంద్రబాబు ఎలాగోలా తంటాలుపడి సుజనాకు మంత్రిపదవి ఇప్పించుకోగలిగాడు. కాని సుజనాపై ఇన్ని ఆరోపణలున్నా మోడీ తన కేబినెట్‌లో ఎందుకు కొనసాగిస్తున్నాడన్నది అర్ధంకాని విషయం.

తెలుగుదేశంకు దక్కిన మూడు రాజ్యసభ స్థానాలలో ఒకటి బీజేపీకి ఇవ్వగా ఇంకోటి సుజనాకు కేటాయించారు. మిగిలిన సీటును కర్నూలుకు చెందిన పారిశ్రామికవేత్త టి.జి.వెంకటేష్‌కు ఇవ్వడం జరిగింది. ఇది పక్కా పేమెంట్ సీటు. పార్టీలో సీనియర్లు ఎందరో వున్నారు. జె.ఆర్.పుష్పరాజ్, బీద మస్తాన్‌రావు వంటి సీనియర్లు చివరిదాకా ప్రయత్నించారు. చంద్రబాబు వారిని కాదని 2014ఎన్నికల నాడు కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరిన టి.జి.కి సీటు ఇవ్వడంపై పార్టీ నాయకులలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జె.ఆర్.పుష్పరాజ్ అయితే తన అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కాడు.

దేశ రాజకీయవ్యవస్థలోనే రాజ్యసభ సీట్లను ఇలా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో నింపవచ్చని, వాటిని పేమెంట్ సీట్లుగా మార్చవచ్చని చాటిన ఘనత చంద్రబాబుదే!

# నెల్లూరు చూస్కో!

(మొదటి పేజీ తరువాయి)

మొన్న చాలాసులువైన మార్గంలో మంత్రి పదవిని దక్కించుకున్న నారాయణకు ఇక ముందు ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. ఆయనను ప్రత్యక్ష రాజకీయాల్లోకి పురమాయిస్తున్నాడు చంద్రబాబు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ చాలా బలహీనంగా వుంది. 2009, 2014 ఎన్నికల్లో రెండుసార్లు ఇక్కడ తెలుగుదేశం పోటీ చేయలేదు. పొత్తులో భాగంగా ఒకసారి సిపిఎంకు, ఇంకోసారి బీజేపీకి వదిలేసింది. దీంతో ఇక్కడ కేడర్ బలహీనపడింది. 2014ఎన్నికల తర్వాత నుండి నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డే నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా కూడా ఉంటున్నాడు. అయితే వీలైనంత వరకు 'రెడ్ల'కు ప్రత్యామ్నాయ అభ్యర్థులను నిలబెట్టాలని చంద్రబాబు ప్లాన్. 2019ఎన్నికలప్పుడు ఈ రెడ్డి ఏ పార్టీలో ఉంటారన్నది ఆయనకే నమ్మకం లేదు. నారాయణ అయితే సొంత మనిషి, డబ్బున్నోడు. ఖర్చు పెట్టగలడు. అదీగాక జనాలకు తెలిసిన మనిషి. ఈ నేపథ్యంలోనే నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా నారాయణను నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి నెల్లూరురూరల్‌లో నారాయణను గట్టి అభ్యర్థిగా నిలబెట్టాలన్నది చంద్రబాబు ఆలోచన!

# లెక్క తప్పలేదు!

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఆపరేషన్ ఆకర్ష స్కీంతో 17మంది వైకాపా ఎమ్మెల్యేలను తన పార్టీలోకి లాగాడు. అయినా వైకాపాకు రాజ్యసభ గెలవడానికి 36మంది ఎమ్మెల్యేలు చాలు. వాళ్ల దగ్గర ఇంకా 49మంది వున్నారు. జగన్ వద్ద మిగిలిన వాళ్లంతా గట్టోళ్లే! మహ అంటే ఇంకో అయిదారుమంది పోయినా ఇబ్బంది లేదు అని నిర్ధారించుకుని విజయసాయిరెడ్డి రంగంలోకి దిగాడు.

ఈయనను రాజ్యసభలో అడుగుపెట్టకుండా చేయడానికి చంద్రబాబు సర్వశక్తులొడ్డాడు. నాలుగో అభ్యర్థిని నిలబెట్టడానికి అవసరమైన స్కోర్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. వైకాపా నుండి తెలుగుదేశంలో దూరిన ఎమ్మెల్యేల నెత్తినే నాలుగో అభ్యర్థి బాధ్యత పెట్టాడు. రాజ్యసభ ఎన్నికలను విజయవాడలో పెట్టేస్తే వైకాపా ఎమ్మెల్యేలను సులభంగా ప్రలోభాలకు గురిచేయొచ్చనుకుని ఆ విధంగా ఎన్నికల సంఘానికి లేఖ రాయించారు. అవేవీ ఫలించలేదు. అదీగాక బలం లేకుండానే నాలుగో అభ్యర్థిని పెట్టాలని చంద్రబాబు చేసిన ప్రయత్నాలపై కేంద్రం సీరియస్ అయ్యింది. రాజ్యసభ ఎన్నికల్లో అనైతిక చర్యలకు పాల్పడితే తమ అభ్యర్థిని ఉపసంహరించుకుంటామని బీజేపీ హెచ్చరించడంతో చంద్రబాబు వెనకడుగేయాల్సి వచ్చింది.

వై.యస్. కుటుంబానికి అప్పుడు, విశ్వాసపాత్రుడు విజయసాయిరెడ్డి. కష్టకాలంలోనూ ఆ కుటుంబం వెన్నంటే ఉన్నాడు. జగన్ కేసుల విషయంలో ఆయన తర్వాత ఈయన పేరే వుంది. జగన్‌కు వ్యతిరేకంగా అప్రూవర్‌గా మారితే నీ మీద కేసులు ఎత్తేస్తామని గత పాలకులు ప్రలోభపెట్టినా ఆయన తన వ్యక్తిత్వాన్ని వీడలేదు. నమ్మకద్రోహానికి పాల్పడలేదు. జగన్ కూడా ఆ నమ్మకాన్ని గౌరవించి మొదట్లోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు.



## నెల్లూరులో... బాలు బర్త్‌డే వేడుకలు

- విస్తృత సన్నాహాలు చేస్తున్న అభిమానులు




వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీరిశెట్టి హజరత్‌బాబు, వెన్నెలకంటి, శేషగిరీశం

పావన పినాకినీ తరంగాలకు, శ్రీ రంగనాధుని కృపా కటాక్షాలకు, తిక్కన కవి పలుకులకు, చక్కని మొలగొలుకులకు పేరెన్నికగన్న నెల్లూరు కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన సింహపురి ముద్దుబిడ్డ, చలనచిత్ర సంగీత ప్రపంచ విజేత.. గానగంధర్వుడు.. ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల 4వతేదీన నెల్లూరులో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సినీకవి వెన్నెలకంటి, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, శ్రీ విజేతా ఆర్ట్స్ ప్రధానకార్యదర్శి వై.శేష గిరీశం తదితరులు పాల్గొని ఆ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. నెల్లూరు పురమందిరం ప్రాంగణంలో వున్న ఓపన్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కుమారి లలితా సింధూరి నాట్య విలాసం, 'పాడుతా తీయగా' గాయనీ గాయకుల స్వరవిన్యాసం ప్రత్యేక ఆకర్షణలుగా వుంటాయని వారు పేర్కొన్నారు. ఈ సభకు వెన్నెలకంటి అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మయూరి అధినేత వీరిశెట్టి వెంకటసుబ్బారావు, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధినేత వెల్లంబేటి చంద్రమౌళి, బలరామయ్యనాయుడు, ప్రముఖ సినీ రచయిత పి.రాజేంద్రకుమార్ ఆత్మీయ అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. తొలుత సభను వీరిశెట్టి హజరత్‌బాబు ప్రారంభిస్తారని, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్యోతి ప్రకాశనం చేస్తారని తెలిపారు. నెల్లూరులోని శ్రీవిజేతా ఆర్ట్స్‌కు డా. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వ్యవస్థాపక అధ్యక్షులుగా వున్నారని, ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఒక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామని వారు తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకుడు వాసూరావును ఘనంగా సత్కరించనున్నామని వీరిశెట్టి హజరత్‌బాబు తెలియజేశారు. వై.శేషగిరీశం మాట్లాడుతూ, శ్రీ విజేతా ఆర్ట్స్‌కు అధ్యక్షునిగా వెన్నెలకంటి, ముఖ్య సమన్వయకర్తగా హజరత్‌బాబు, ఉపాధ్యక్షులుగా పి.రాజేంద్రకుమార్, సభ్యులుగా ఎస్.సుబ్బారావు, పి.సత్యనారాయణ, వై.విశ్వనాధం, వి.శేఖర్‌బాబు, జెవిడిఎన్ శివకుమార్, డా.ఎం. సుబ్రహ్మణ్యం, జి.ఆదిశేషు, డి.బెనర్జీ, ఎం.రామకృష్ణ, కలవకొలను అనంత్ సభ్యులుగా వ్యవహరించనున్నారని, శ్రీ విజేతా ఆర్ట్స్ ఈ కార్యక్రమం సమర్పిస్తుందని తెలియజేశారు. తొలుత, అందరూ కలసి బాలూ జన్మదినోత్సవ బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమాలకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పొగ త్రాగితే.. బ్రతుకులు బుగ్గిపాలు!

- హెచ్చరిస్తున్న అపోలో వైద్యులు విజయ్ అమరనాథరెడ్డి, హరిత





ఈ ఆధునిక కాలంలో ఎక్కువ రోగాలకు మూల కారణం ధూమపానం. పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల ప్రాణాల్నే హరించేంతటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. పొగకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యానికి ప్రజలు చేరువ కావాలని నెల్లూరులోని అపోలో వైద్యులు డా॥ విజయ్ అమరనాథరెడ్డి, డా॥ హరితలు సూచిస్తున్నారు. పొగ త్రాగడంపై వచ్చే అనర్ధాలను వారు 'లాయర్'కు వివరించారు.

పొగ త్రాగేవారి జీవితకాలం 14సంవత్సరాలు తగ్గిపోతుంది. సాధారణంగా మానవులు తమ జీవితకాలం పెంచుకోవాలని చూస్తారు. అయినా కూడా కొంతమంది పొగాకు వాడుతుంటారు. కాబట్టి 2016 ప్రపంచ పొగాకు నిషేధ దినం సారాంశం "ప్లెయిన్ ప్యాకేజింగ్"కు సిద్ధం కావాలి. ప్లెయిన్ ప్యాకేజింగ్ పొగాకు ఉత్పత్తుల డిమాండ్‌ను తగ్గిస్తాయి. పొగాకు ఉత్పత్తుల పట్ల ఆకర్షితులు కాకుండా చేస్తాయి. పొగాకులోని రసాయనాలు రక్తకణాలకు చేటు కలిగిస్తాయి. అంతేకాక అది గుండె పనితీరును దెబ్బతీస్తుంది. గుండె జబ్బులకు ప్రధాన కారణం పొగత్రాగడమే. అనారోగ్యకరమైన రక్తంలో క్రొవ్వు పరిమాణం, అధిక రక్తపోటు, ఊబకాయం కూడా ఉన్నట్లయితే ఇంకా గుండెజబ్బు వచ్చేందుకు అవకాశాలు తీవ్రంగా ఉంటాయి.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వాడకం వల్ల ప్రతి రోజూ సుమారుగా 6 మిలియన్ల మంది చనిపోతున్నారు. పొగాకు వాడడం వల్ల కలిగే నష్టాలను గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సి వుంది. ప్రతి సంవత్సరం మే నెల 31వ తేదీన ఒక రోజంతా పొగాకు వాడకుండా చూడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వాడేవారు 24గంటల పాటు పొగాకు వాడకం నిలిపివేసేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. పొగాకు మానాలనుకునే వారికి తగు సహాయం చేయాలని సూచించింది.

**సిగరెట్టు గురించి వాస్తవాలు:** ఇందులో పొగాకు ముఖ్యంగా వాడబడుతుంది. పొగాకు పండించే రైతులు అనేక రకాల రసాయనాలు వాడుతుంటారు. ఈ ఎరువుల వల్ల నేలలో పుష్టి పెరుగుతుందని, పురుగుమందులు పొగాకు పంటను నాశనం చేయకుండా వుంటుందని వారి భావన. సిగరెట్టులో సుమారుగా 4000 రకాల రసాయనాలుంటాయి. వాటిలో 51 రకాలు క్యాన్సర్‌ను కలిగించేవిగా ఉంటాయి. వాటిలో నికోటిన్, తారు, కార్బన్ మోనాక్సైడ్ వంటి మూడు రకాల ప్రమాదకరమైన రసాయనాలు వుంటాయి. నికోటిన్ అనేది పురుగుమందుల్లో విషపూరిత వాయు రూపంలో వుంటుంది. పొగాకు పూర్తిగా వాడిన తర్వాత దానిలో మిగిలేది తారుగా గుర్తించబడింది. ఇలా చాలా ఎక్కువ పరిమాణంలో తారు పేరుకుపోవడం వల్ల ఊపిరితిత్తులను ఇవి పాడుచేస్తాయి. వాహనాల నుండి వెలువడే పొగలో కార్బన్ మోనాక్సైడ్ అనే విషపూరిత వాయువు వుంటుంది. దీనిని పీల్చడం వల్ల శ్వాసకోశ వ్యవస్థ, రక్త సరఫరా వ్యవస్థ దెబ్బతింటాయి.

పొగ త్రాగడం వల్ల ఊపిరితిత్తులే కాకుండా, నోరు, గొంతు, కాలేయం, పెద్దప్రేగులు, మూత్రాశయం, మూత్రపిండాలు, క్లోమము, రక్తము మరియు గర్భాశయము కూడా క్యాన్సర్ వ్యాధిబారిన పడతాయి. ప్రపంచ పొగాకు నిషేధ దినం వాస్తవాలను ప్రతిబింబించేదిగా వుంటూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రజారోగ్యం అవసరం గుర్తించేదిగా వుంది. పొగాకు వాడకంపై జరిగిన ఇటీవల అధ్యయనాల ద్వారా గ్రహించబడిన విషయాలను అధికారికంగా ప్రజలకు తెలియజేయడం ద్వారా, దీనిపై ప్రపంచ వ్యాప్తంగా మరింత చర్చ జరగాలని ఆశిస్తున్నాం.

## ఆనం విజయకు.. వైకాపాలో కీలక బాధ్యత



జగన్‌తో ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆనం విజయకుమార్ రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఆనం విజయకుమార్‌రెడ్డి సేవలను రాష్ట్ర స్థాయిలో ఉపయోగించుకోవాలని కోరడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఆనం సోదరులలో నాల్గవ వాడైన ఆనం విజయకుమార్‌రెడ్డి తెలుగుదేశంలో చేరిన తన అన్నలతో విభేదించి ఇటీవలే వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే! కస్తూరిదేవి గార్డెన్స్‌లో జన సందోహం మధ్య జరిగిన కార్యక్రమంలో జగన్ సమక్షంలో ఆయన వైకాపాలో చేరాడు. ముక్కుసూటి మనిషి, కుళ్లు, కుతంత్రాలు, రాజకీయ వెన్నుపోట్లు తెలియవు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆయన నైజం. రూరల్‌లో పట్టున్న నాయకుడు. పార్టీ ఉపయోగించుకుంటే ఖచ్చితంగా ఉపయోగపడతాడు.

## పోలీస్ పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ చదువు

- జిల్లా ఎస్పీ విశాల్



పోలీస్ పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందించనున్నట్లు నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ తెలిపారు. మంగళవారం రాత్రి నెల్లూరు దర్గామిట్టలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ, పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ ఆధారంగా 110 మంది పోలీస్ పిల్లలకు కౌన్సిలింగ్ జరిగింది. విద్యార్థులకు నచ్చిన కళాశాలల్లో సీట్లు కేటాయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీస్ పిల్లలకు ఉచితంగా ఇంటర్ చదివేందుకు అవకాశం కల్పించామన్నారు. పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎస్పీ ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో కార్పొరేట్ కళాశాలలు 90మందికి ఉచిత విద్యను అందించేందుకు ముందుకొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ బి.శరత్‌బాబు, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు తురకా శ్రీనివాసరావు, ప్రసాద్, చెంగయ్య, రాజారాం, శ్రీనివాసులు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com